PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 42 సంచిక : 306 | విజయవాడ, బుధవారం 12 జూన్ 2024 | 12 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 12 June 2024 | Rs




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం





ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రమాణ స్వీకార మహోత్సవం

తేదీ & సమయం

జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు

స్థలం

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా

ముఖ్య అతిథులు

భారత ప్రధాని **శ్రీ నరేంద్ర మోదీ గారు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ **శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు**

భారత హోమ్ శాఖామాత్యులు **శ్రీ అమిత్ షా గారు**

విశిష్ట అతిథులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు **శ్రీమతి పురందేశ్వరి గారు**

జనసేన అధినేత **శ్రీ పవన్ కళ్యాణ్ గారు**

అందరికీ స్వాగతం... సుస్వాగతం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


జయహో... చంద్రన్న.....
ప్రజల హృదయాలలో
సుస్థిర స్థానం సాధించి
నేడు నాల్గవసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర
ముఖ్యమంత్రి వర్యులుగా
ప్రమాణ స్వీకారం చేయుచున్న
మన ప్రియతమ నేత
మాన్యశ్రీ నారా
చంద్రబాబునాయుడు గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలతో ...
మా ప్రియతమ నాయకులు
శ్రీ వేగేశన నరేంద్ర వర్మరాజు గారిని
అత్యధిక మెజారిటీతో శాసనసభ్యునిగా
గెలిపించిన బాపట్ల
నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు,అభిమానులకు
శ్రేయోభిలాషులకు హృదయపూర్వక
కృతజ్ఞతాభివందనములు...
ఇట్లు..
టిడిపి, జనసేన ,బిజెపి, నాయకులు మరియు ప్రజలు.
బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 308 | విజయవాడ, బుధవారం 12 జూన్ 2024 | 12 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 12 June 2024 | Rs

ధరల మంట!

- అమాంతం పెరిగిన కూరగాయల రేట్లు
- భారీగా అల్లం ధర
- కలవరపెడుతున్న టమాట, మిర్చి, ఆకుకూరలు, పప్పు దినుసులు

• లోపలి పేజీలో..•



టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌కు ఊరట లభించింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన పాక్ జట్టు సోమవారం కెనడాపై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెనడా 20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 106పరుగులు చేయగా.. పాకిస్తాన్ 17.3ఓవర్లలో 107పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అమీర్‌కు లభించింది.

పరీక్షల పవిత్రత దెబ్బతింది !

మాకు సమాధానాలు కావాలి

నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సుప్రీం సీరియస్

కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు

జులై 8కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : నీట్ పరీక్ష వివాదంపై సుప్రీం కోర్టు కేంద్రానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)కు మంగళవారం నోటీసులు జారీ చేసింది. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నా పత్రం లీక్, అవకతవకలకు సంబంధించి పెద్దయెత్తున ఫిర్యాదులు వచ్చాయి. పరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుతులాతో కూడిన సుప్రీం వెకేషన్ బెంచ్ ఈమేరకు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారం పరీక్షా ప్రక్రియ పవిత్రతను దెబ్బతీసేదిగా ఉందని సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నీట్ పరీక్ష నిర్వహించిన రోజునే ప్రశ్నా పత్రం లీక్ అయినట్లు పెద్దయెత్తున ఆందోళన వ్యక్తమైంది. ఫలితాలు వెలువడిన తరువాత ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. 67 మంది విద్యార్థులు పూర్తి మార్కులతో మొదటి ర్యాంకులో నిలవడం, హర్యానాలో ఆ పరీక్షా కేంద్రాల్లో రాసిన విద్యార్థులకు అత్యధిక మార్కులు రావడంతో విద్యార్థుల్లోను, వారి తల్లిదండ్రుల్లోను తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సుప్రీం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.అయితే, అడ్మిషన్లకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిలుపు చేయడానికి కోర్టు తిరస్కరించింది. దీనిపై



తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వద్ద పెండింగ్‌లో వున్న పిటిషన్‌ను, శివంగి మిశ్రా, తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి జులై 8న విచారిస్తామని తెలిపింది. నీట్ పరీక్ష మే 5న నిర్వహించగా, జూన్4 ఫలితాలు వెలువడ్డాయి. గ్రేస్ మార్కులు కలపడంలో కూడా చాలా తేడాలు వున్నాయని, వాటిల్లో లాజిక్ ఏమిటో బోధపడడం లేదని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కు చెందిన పిటిషనర్లు పేర్కొన్నారు. 'పరీక్షా సమయాన్ని కొంతమేరకు కోల్పోవడం వల్లనే ఈ గ్రేస్ మార్కులు కలిపామని కారణం చెబుతున్నారని, ఆ పరీక్షా సమయం కోల్పోవడమేంటో ఇంతవరకు వెల్లడించలేదని వారు పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక, వైద్య పరిజ్ఞానానికి సంబంధించి లోతైన అవగాహన కలిగివుండాల్సిన ఇటువంటి పరీక్షల్లో మోసాలు , అక్రమాలు చోటుచేసుకుంటే దాని పర్యవసానాలు సమాజంపై దారుణంగా ఉంటాయని పిటిషనర్లు పేర్కొన్నారు.

24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక
- ప్రొటెం స్పీకర్‌గా కె.సురేష్, రాధామోహన్ సింగ్ పేర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈనెల 24 నుంచి జులై 3 వరకూ జరగనున్నాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక, కొత్త ఎంపిల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఎనిమిది రోజులపాటు ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. జూన్ 24, 25 తేదీల్లో కొత్త పార్లమెంట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్, బిజెపి ఎంపి రాధామోహన్‌సింగ్ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రొటెం స్పీకరే ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. నరేంద్ర మోడీ వరుసగా మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మోడీ 3.0 కేబినెట్ కూర్పు కూడా పూర్తయింది. మొత్తం 71 మంది ఎంపిలకు మంత్రులుగా అవకాశం దక్కింది. వీరందరికీ శాఖలు కూడా కేటాయిం చడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇటీవల జరిగిన లోక్‌సభకు పది మంది సభ్యులు ఎన్నిక కావడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. రాజ్యసభ సెక్రటేరియట్ ఆ ఖాళీలను నోటిఫై చేసింది. ఇందులో అస్సాం, బీహార్, మహారాష్ట్రలలో రెండు, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురలలో ఒక్కొక్కటి ఉన్నాయి. రాజ్యసభ సెక్రటేరియట్ సీట్ల ఖాళీ వివరాలను తెలియజేస్తూ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. "కామాఖ్య ప్రసాద్ తాసా, సర్బానంద సోనోవాల్ (అస్సాం), మిషా భారతి, వివేక్ ఠాకూర్ (బీహార్), దీపేందర్ సింగ్ హుడా (హర్యానా), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్), ఉదయన్‌రాజె భోంస్లే (మహారాష్ట్ర), పీయుష్ గోయల్ (మహారాష్ట్ర), కెసి వేణుగోపాల్ (కేరళ), విప్లవ్ కుమార్ దేవ్ (త్రిపుర) ఖాళీలు ఏర్పడ్డాయి. నోటిఫికేషన్ తరువాత ఈ ఖాళీల భర్తీకి ఎన్నికల కమిషన్ తేదీలను ప్రకటించనుంది.

'కూటమి' పక్ష నేతగా బాబు

- ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం
- నేడు ప్రమాణ స్వీకారం
- ఇది అత్యున్నతమైన బాధ్యత : ఎంఎల్‌ఎలతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ శాసనసభ పక్ష నేతగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన కూటమి ఎంఎల్‌ఏల సమావేశంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చంద్రబాబు పేరును ప్రతిపాదించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఈ ప్రతిపాదనను బలపరచారు. కూటమి ఎంఎల్‌ఏలందరు ఈ ప్రతిపాదనను హర్షధ్వానాల మధ్య ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కూటమి తరపున పురంధేశ్వరిచ, అచ్చెన్నాయుడు, జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. కూటమి పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నట్లు 163 మంది ఎంఎల్‌ఏల సంతకాలతో ఉన్న లేఖను గవర్నర్‌కు అందచేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని కోరారు. ఈ లేఖతో పాటు చంద్రబాబుకు మద్దతు తెలిపే లేఖలను మూడు పార్టీల నేతలు విడివిడిగా అందచేశారు. ఈ లేఖలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా చంద్రబాబును గవర్నర్ ఆహ్వానించారు. సాయంత్రం ఐదు గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను చంద్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రివర్గ ఏర్పాటు గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11.27 గంటలకు కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటి పార్కు వద్ద ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు బిజెపి నేతలు జెపి నడ్డా,



ఎన్‌డిఎ శాసన సభాపక్ష నేతగా ఎన్నికైన అనంతరం అభివాదం చేస్తున్న చంద్రబాబు, వేదికపై పవన్, పురంధేశ్వరి

ప్రముఖ సినీ నటులు చిరంజీవి, రజనీకాంత్ ప్రభృతులు హాజరుకానున్నారు.

అంతకుముందు, ఎన్‌డిఎ కూటమి ఎంఎల్‌ఏలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు తమకు ఇచ్చింది అధికారం కాదని, అత్యున్నతమైన బాధ్యత అని అన్నారు. ప్రజల పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని చెప్పారు. ప్రజావేదికల కూల్చివేతలు, మూడు రాజధానుల ఆటలు తమ ప్రభుత్వంలో ఉండవని అన్నారు. బుధవారం నుండి రాష్ట్రంలో ప్రజాపరిపాలన సాగుతుందని, ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుందని అన్నారు. బాధ్యతాయుతమైన, పాజిటివ్ గవర్నమెంట్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే దారికి వస్తారని అన్నారు. చట్టపరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలన్నారు. రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర సహకారం కూడా అవసరమని, కేంద్రం కూడా ఆ మేరకు హామీ ఇచ్చిందని తెలిపారు.

హామీలు పూర్తిచేయాలి: పవన్ కళ్యాణ్

మానిఫెస్టోలో ఇచ్చిన మాటలన్నింటినీ పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా **మిగతా 5లో**

అమరావతే రాజధాని

రాష్ట్ర రాజధాని అమరావతి మాత్రమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. తన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించిన ఆయన రాజధాని విషయంలో ఇక సందేహాలకు ఏమాత్రం తావు లేదని అన్నారు. విశాఖపట్నంను ఆర్థిక రాజధానిగా, ప్రత్యేక రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. రాయలసీమలోని కర్నూలును అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతి పట్ల అన్ని విధాల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీనివల్ల ఆర్థికంగానూ నష్టం జరిగిందని చెప్పారు. విశాఖ రాజధాని అంశాన్ని అక్కడి ప్రజలు కూడా తిరస్కరించారని, ఎన్నికల ఫలితాల్లో ఈ విషయం స్పష్టంగా కనిపించిదని అన్నారు.

సంపాదకీయం


'నీట్' మాయలు!

వైద్య కోర్సుల్లో ప్రవేశార్హతకు నిర్వహించే నీట్ పరీక్ష గతంలో ఎన్నడూ లేనివిధంగా అప్రతిష్ట పాలైంది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పరీక్ష నిర్వహణలో కనీస జాగ్రత్తలు తీసుకున్నారా? ఎంతో చిత్తశుద్ధితో నిజాయితీగా నిర్వహించాల్సిన పరీక్షల్లో పారదర్శకతేదీ? అంటూ అంతటా చర్చ సాగుతోంది. పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ... 'పరీక్షను రద్దు చేయడం అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలి. దీనిపై స్పందన తెలియజేయండి' అంటూ పరీక్షలు నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఆదేశించడం పరీక్ష నిర్వహణ, ఫలితాల వెల్లడిలో లోపాలకు ప్రాథమిక ప్రతిస్పందనగా భావించవచ్చు.

ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రీకృతం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వాలను పక్కనపెట్టడం ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదు. ఈ అంశంపై ఇప్పటికే తమిళనాడు వంటి రాష్ట్రాలు పోరాడుతున్నాయి. నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను మనదేశంలో 2016లో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 180 ప్రశ్నలను 180 నిమిషాల్లో అంటే మూడు గంటల్లో విద్యార్థి రాయాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున 180 ప్రశ్నలకు 720 మార్కులు వస్తాయి. ప్రశ్నకు సమాధానం తప్పుగా పెడితే ఒక మార్కు మైనస్ అవుతుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పరీక్షకు ఈ ఏడాది 23 లక్షల 33 వేల 297 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో పాస్ చేయిస్తామంటూ రూ.10 లక్షల చొప్పున వసూలు చేశారంటూ పరీక్షకు ముందురోజే గుజరాత్‌లో ఇద్దరిని అరెస్టు చేశారు. పాట్నాలో పేపర్ లీక్ ఫిర్యాదులతో 13 మంది కటకటాల పాలయ్యారు. ప్రశ్నాపత్రం లీకైందంటూ కొన్ని ఫొటోలతో పరీక్ష జరిగిన మే 5నే సోషల్ మీడియా హోరెత్తింది. ఫలితాలు విడుదల చేయొద్దని, నీట్ మళ్లీ నిర్వహించాలనే డిమాండ్లు నాటి నుంచే ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టునుసైతం పిటిషనర్లు ఆశ్రయించారు. షెడ్యూల్ కంటే పది రోజుల ముందుగా జూన్ 4నే నీట్ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షల నిర్వహణలో లోపాలను, పేపర్ లీకేజీని, అక్రమాలను ఎవరూ పట్టించుకోరనే ఎన్నికల ఫలితాల రోజున విడుదల చేశారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఫలితాలు కూడా పలు అనుమానాలను రేకెత్తించాయి. 2019, 20లో ఒక్కొక్కరు, 2021లో ముగ్గురు టాపర్లుగా నిలిస్తే ఈ ఏడాది 67 మంది టాపర్లుగా ఎలా ఎంపికయ్యారు? హర్యానాలో ఒకే పరీక్షా కేంద్రంలో ఒకే హాల్ టిక్కెట్ సిరీస్ ఉన్న ఎనిమిదిమంది ఎలా టాపర్లయ్యారు? విద్యార్థులకు 720 మార్కులు లేదా 716 లేదా 715 మార్కులు రావాలి కానీ, 717, 718, 719 చొప్పున మార్కులెలా వచ్చాయి? గత ఏడాదితో పోలిస్తే మూడు లక్షల మంది అధికంగా పరీక్ష రాయడం వల్ల టాపర్ల సంఖ్య పెరిగిందని ఎన్‌టిఎ చెబుతోంది. మిగిలిన వాటికీ ఇలాంటి సమాధానాలే!

ఇక మరోచోద్యమేమిటంటే చాలాచోట్ల ప్రశ్నాపత్రం ఇవ్వడం ఆలస్యమైంది. సమయాన్ని పెంచడానికి బదులుగా ఒక నిమిషానికి ఒక ప్రశ్నకు సమాధానం రాయాల్సి ఉన్నందున ఎన్ని నిమిషాలు ఆలస్యమైతే అన్ని నాలుగు మార్కుల చొప్పున కలిపారు. ఇలా మార్కులు కలపడం వల్ల 1500 మంది మార్కులలో మార్పులు వచ్చాయి. టాపర్స్‌గా నిలిచిన ఆరుగురు ఇలా కాంపన్సేటరీ మార్కులు పొందినవారే. ఈ గ్రేస్ మార్కులపై కలకత్తా, ఢిల్లీ హైకోర్టులతోపాటు సుప్రీంలోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ ఆరోపణలపై విచారణకు యుపిఎస్‌సి మాజీ ఛైర్మన్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిజానిజాలు నిగ్గుతేల్చాలి. విద్యార్థుల భవిష్యత్తుకు హాని కలగకుండా సత్వర చర్యలు చేపట్టాలి. వైద్య విద్యకు, వైద్య వృత్తికి నేడు సమాజంలో ఉన్న ప్రాధాన్యత రీత్యా 'నీట్'ను లోపరహితంగా నిర్వహించాలి. ఈ ఏడాది పరీక్ష విషయంలో సమగ్ర దర్యాప్తు నిర్వహించడం కేంద్రం బాధ్యత. అంతేగాక ఈ అంశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య విద్యనభ్యసించాలని ఆకాంక్షించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లేవనెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయాలి.


మంచి మాట



మీరు చేసే పని
అద్భుతంగా ఉండాలంటే
దానిని ప్రేమించడం నేర్చుకోండి.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.


Albert Einstein

ఈ నిరుద్యోగానికి పరిష్కారం ఎలా?



> **"ఇప్పుడు చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలుగా భర్తీ కాకుండా పడివున్నాయి. విద్యా రంగంలో సిబ్బంది కొరత తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దాని ఫలితంగా విద్యా ప్రమాణాలు దెబ్బ తినిపోతున్నాయి. చివరికి సైన్యంలో సైతం మామూలు స్థాయిలో ఖాళీలను నింపడం లేదు. దానికి తోడు అగ్నివీర్ వంటి పథకాలను ప్రవేశపెట్టడం నిరుద్యోగ తీవ్రతను పెంచింది. ఉపాధి కల్పనలో తక్కిన యజమానులకన్నా ముందుండి దారి చూపవలసిన ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచడంలో ముందుంది. ద్రవ్యపరంగా నియంత్రణలు అమలులో ఉండడమే దీనికి కారణం."**

ఆర్థిక శాస్త్రంలో డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థకి, సప్లయ్‌కి కొరత ఉన్న వ్యవస్థకి (పెట్టుబడులకు, ముడి సరుకులకు, కార్మికులకు, టెక్నాలజీకి కొరత ఉండడాన్ని సప్లయ్‌కి కొరత ఉన్నట్టు పరిగణిస్తాం) మధ్య తేడాను చూస్తారు. మొదటి తరహా వ్యవస్థలో స్థూల డిమాండు పెరిగితే అందుకు అనుగుణంగా సరుకుల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. డిమాండుకు తగినట్టు సరుకుల సరఫరా లేకపోతే వాటి ధరలు పెరుగుతాయి. ఉత్పత్తిని పెంచడం ద్వారా అటువంటి ధరల పెరుగులను నివారించవచ్చు. అదే రెండో తరహా వ్యవస్థలో (సప్లయ్‌కి కొరత ఉన్న వ్యవస్థలో) స్థూల డిమాండు గనుక పెరిగితే అది ఉత్పత్తి పెరుగుదలకు దారితీయదు. అప్పటికే ఆ వ్యవస్థలో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించివున్నందున (అప్పుడు అదనంగా ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు) గాని, లేదా ఏవైనా కీలకమైన ముడి సరుకులకో, పరికరాలకో, కార్మికులకో కొరత ఏర్పడినందువలన గాని మార్కెట్‌కు అవసరమైనంత మేరకు ఉత్పత్తి చేయలేని పరిస్థితి ఉంటుంది. అటువంటి స్థితిలో స్థూల డిమాండు మరింత పెరిగితే అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. యుద్ధ సమయాల్లో మినహాయిస్తే సాధారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థగానే ఉంటుంది. అదే సోషలిస్టు వ్యవస్థలో (గతంలోని సోవియట్ యూనియన్ లేదా తూర్పు యూరప్ దేశాల వ్యవస్థలలో) సప్లయ్‌కి కొరత ఉండేది. డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థలో గనుక స్థూల డిమాండ్ పెరిగితే దానితోబాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.



ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం మన దేశంలో నిరుద్యోగం ఒక తీవ్ర సామాజిక సమస్యగా ఉంది. దాని తీవ్రత తాజా ఎన్నికలలో బిజెపి బలం తగ్గడానికి దోహదం చేసింది. అందుచేత నిరుద్యోగ సమస్యను అత్యవసరంగా పరిష్కరించవలసిన అగత్యం ముందుకొచ్చింది. ఈ పరిస్థితిలో ఆర్థిక వ్యవస్థల్లో పైన తెలిపిన తేడాను దృష్టిలో ఉంచుకోవడం అవసరం.

మన దేశంలో ప్రభుత్వ సర్వీసులతో సహా సేవా రంగంలో చాలా గణనీయంగా ఉపాధి కల్పనను కావాలనే తగ్గించారు ఇక్కడ పెట్టుబడికి కొరత అన్న సమస్య ఏదీ లేదు. అదే విధంగా మనకి ఇప్పుడు పెట్టుబడికి గాని, కార్మికులకు గాని ఏ ఇతర ఇన్‌పుట్‌లకు గాని కొరత లేదు. ఆహారధాన్యాల నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. పేదలకు ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేయడాన్ని తొలుత ఎకసెక్కం చేసిన మోడీ ప్రభుత్వం కూడా ఉన్న ఆహారధాన్యాల నిల్వలను కుటుంబానికి 5 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేసి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నించింది. ఇప్పుడు తగ్గిన నిల్వలను పెంచుకోడానికి అంతర్జాతీయ మార్కెట్ నుండి గోధుమలను కొనుగోలు చేయడానికి మన దేశం ప్రయత్నిస్తోంది. దీనికి కారణం ఉన్న నిల్వలను సక్రమంగా వినియోగించలేక దుర్వినియోగం చేయడమే. అంతేకాని దేశంలో ఇప్పుడు ఆహారధాన్యాల కొరత ఏమీ లేదు. అందుచేత ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న తీవ్ర నిరుద్యోగానికి కారణం డిమాండుకు తీవ్ర కొరత ఉన్న వ్యవస్థే. దీనిని పరిష్కరించడానికి వెంటనే స్థూల డిమాండును పెంచాలి. దానికోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాలి.

ఇప్పుడు చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలుగా భర్తీ కాకుండా పడివున్నాయి. విద్యా రంగంలో సిబ్బంది కొరత తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దాని ఫలితంగా విద్యా ప్రమాణాలు దెబ్బ తినిపోతున్నాయి. చివరికి సైన్యంలో సైతం మామూలు స్థాయిలో ఖాళీలను నింపడం లేదు. దానికి తోడు అగ్నివీర్ వంటి పథకాలను ప్రవేశపెట్టడం నిరుద్యోగ తీవ్రతను పెంచింది. ఉపాధి కల్పనలో తక్కిన యజమానులకన్నా ముందుండి దారి చూపవలసిన ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచడంలో ముందుంది. ద్రవ్యపరంగా నియంత్రణలు అమలులో ఉండడమే దీనికి కారణం. ఈ అంశాన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం.

ఇంతకు ముందు మనం డిమాండుకు కొరత ఉన్న ఆర్థిక వ్యవస్థకి, సప్లయ్‌కి కొరత ఉన్న ఆర్థిక వ్యవస్థకి మధ్య ఉండే తేడాను గురించి చర్చించాం. ఏదైనా ఒక సర్వ స్వతంత్ర దేశపు ఆర్థిక వ్యవస్థలో సప్లయ్‌కి సంబంధించిన కొరత ఉండే అవకాశం లేదు. ఇక ఒక సర్వ స్వతంత్ర దేశం మీద ద్రవ్యపరమైన నియంత్రణలు మామూలుగా ఉండే అవకాశం లేదు. ఏవైనా ద్రవ్య పరమైన నియంత్రణలు ఉంటే అవి అంతర్జాతీయ పెట్టుబడి మన ప్రభుత్వం మీద విధించినవై వుండాలి, అందుకు ఆ అంతర్జాతీయ పెట్టుబడికి స్థానిక మిత్రులైన దేశీయ కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడి ముఠా తోడై వుండాలి. అంటే ద్రవ్య నియంత్రణతో మన దేశం తన స్వయం నిర్ణయాధికారాన్ని కొంతమేరకు కోల్పోయినట్టు భావించాలి. అంతే తప్ప స్వతహాగా మన ప్రభుత్వం ఏవో పరిమితుల మధ్య ఉన్నట్టు కాదు.

నిజానికి డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థలో ఆ డిమాండును పెంచడానికి అవసరమైన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం చేయాలంటే అందుకు ఆటంకం ఏమీ ఉండదు. 90 సంవత్సరాల క్రితమే కాలెక్కీ-కీన్స్ సైద్ధాంతికంగా అర్థశాస్త్రంలో తెచ్చిన పెనుమార్పులు ఆటంకాలు వుంటాయనే వాదాన్ని తిప్పికొట్టాయి. అప్పుడు తిరస్కరించబడ్డ వాదనలనే ఇప్పుడు మళ్ళీ ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యయం మీద పరిమితులు బడా కార్పొరేట్లు విధించినవే తప్ప స్వతహాగా ఉన్నవి కానే కావు. అందుచేత అంతర్జాతీయ, దేశీయ బడా పెట్టుబడి దురాశాపూరితమైన నిబంధనల ఉచ్చు నుండి బైటపడి, నిరుద్యోగాన్ని పరిష్కరించేందుకు తన దృఢ నిశ్చయాన్ని ప్రభుత్వం ప్రదర్శించాల్సి వుంది.

ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచడానికి ద్రవ్యలోటును పెంచి ఖర్చు చేయాల్సి వుంటుంది. దానివలన ఉపాధి కల్పన పెరుగుతుంది. ఇలా ద్రవ్యలోటు పెరిగితే దాని ఫలితంగా ప్రైవేటు పెట్టుబడులు తగ్గుతాయన్న వాదనలు పస లేనివి. నిజానికి ద్రవ్యలోటు పెరిగితే దానివలన కలిగే నష్టం ఏమిటంటే అది సంపదలో అసమానతలు పెరగడానికి దారితీస్తుంది. ఇదెలాగ జరుగుతుందో చూద్దాం. ఉదాహరణకు ప్రభుత్వం రూ.100 మేరకు తన వ్యయాన్ని పెంచిందనుకుందాం. అందుకోసం అప్పు చేసింది అనుకుందాం (ద్రవ్య లోటు పెంచడం అంటే అప్పు చేసి ఖర్చు చేయడమనే అర్థం). అలా ఖర్చు చేసిన రూ.100 చివరికి పెట్టుబడిదారుల దగ్గరకే చేరుతాయి (ముందు కార్మికులకు అందినా, ఆ సొమ్మును వారు ఖర్చు చేస్తారు గనుక అంతిమంగా ఆ సొమ్ము పెట్టుబడిదారుల దగ్గరకే చేరుతుంది). ప్రభుత్వం ఆ పెట్టుబడిదారుల నుండే అప్పు తీసుకుంటుంది.

> **"ఇప్పుడున్న పరిస్థితుల్లో నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే తక్షణ పరిష్కారం. ఆ అదనపు ప్రభుత్వ వ్యయానికి కావలసిన వనరులను సమీకరించడానికి సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడమే సముచిత మార్గం. దీనివలన ఒకే దెబ్బకు అనేక పిట్టల్ని కొట్టవచ్చు. ఒకటి: ఉద్యోగాలు పెరుగుతాయి, రెండు: సంపద అసమానతలు పెరిగిపోకుండా అదుపులో ఉంటాయి. తద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుంది, మూడు: విద్యా, వైద్య ప్రమాణాలు మన దేశంలో మెరుగుపడతాయి."**

దీనిని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే మనం ఆర్థిక వ్యవస్థని మూడు విడివిడి భాగాలుగా విడదీసి చూడాలి. మొదటిది: ప్రభుత్వం. రెండోది:శ్రామిక ప్రజలు, మూడోది : పెట్టుబడిదారులు. ఈ మూడు భాగాల దగ్గర ఏర్పడే లోటు అంతా కలిపితే ఎప్పుడూ సున్నాగానే ఉంటుంది (లోటు అంటే అప్పు చేసి ఖర్చు చేయడం. ఒకడు అప్పు చేయాలంటే దానిని ఇచ్చేవాడు మరొకడు ఉండాలి కదా. ఇద్దరిదీ కలిపితే నికర లోటు సున్నా అవుతుంది కదా). శ్రామిక ప్రజలు ఎంత సంపాదిస్తారో అంతా ఖర్చు చేసేస్తారు. అందుచేత వారివద్ద లోటు ఏమీ ఉండదు (వాళ్ళలో వాళ్ళు ఒకరికొకరు అప్పులిచ్చుకోవాలే తప్ప పెట్టుబడిదారులు పేదలకు అప్పులివ్వరు). అందుచేత ప్రభుత్వం అప్పు చేసి ఖర్చు చేయాలంటే అంతిమంగా అది పెట్టుబడిదారుల నుండే మిగులు నుండే చేయాలి. ప్రభుత్వం బ్యాంకుల నుండి మొదట రూ.100 అప్పు తెచ్చి ఖర్చు చేస్తుంది. ఆ ఖర్చు అంతిమంగా పెట్టుబడిదారుల దగ్గరకు చేరుతుంది. అప్పుడు ఆ పెట్టుబడిదారుల నుండి ప్రభుత్వం రూ.100 అప్పు తెచ్చి బ్యాంకుల అప్పు తీరుస్తుంది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల దగ్గర రూ.100 మిగులు పోగుబడుతుంది. దీనివలన పెట్టుబడిదారులు అదనంగా కష్టపడేదేమీ లేదు సరికదా, వారికి మిగులు చేరుతుంది. ప్రభుత్వం చేసే అదనపు వ్యయం వలన ఈ పెట్టుబడిదారుల దగ్గర అమ్ముడుపోకుండా మిగిలిపోయిన సరుకులు చెల్లుబాటు అవుతాయి. దానితోబాటు అదనంగా సంపద పోగుబడుతుంది. ఇది సంపద అసమానతలకు దారి తీస్తుంది. ఈ విధంగా సంపదలో అసమానతలు పెరిగిపోకుండా ఉండాలంటే, పెట్టుబడిదారుల దగ్గర పోగుబడిన అదనపు సంపదను పన్ను రూపంలో ప్రభుత్వం తిరిగి తీసుకోవాలి. అలా తీసుకున్నందువలన పెట్టుబడిదారులకు అంతవరకూ ఉన్న సంపద ఏమీ తగ్గిపోదు. కేవలం అదనంగా పోగుబడినది మాత్రమే పన్ను రూపంలో వెనక్కి పోతుంది.

అంటే ప్రభుత్వ వ్యయాన్ని పెంచి నిరుద్యోగాన్ని తగ్గించడం ద్వారా అంతరకూ పెట్టుబడిదారుల దగ్గర పోగుబడిన సంపద ఏమీ తగ్గిపోదు. అందుచేత అంతర్జాతీయ, దేశీయ బడా కార్పొరేట్లు ఎటువంటి ఆటంకాలు కల్పించినా, వాటన్నింటినీ అధిగమించే ధైర్యాన్ని ప్రభుత్వం ప్రదర్శించగలిగితే నిరుద్యోగాన్ని పరిష్కరించవచ్చు.

ముందు ప్రభుత్వ విద్యాలయాల్లో, యూనివర్సిటీల్లో ఉన్న బోధన, బోధనేతర పోస్టులనన్నింటినీ భర్తీ చేయాలి. అదే విధంగా వైద్య రంగంలో కూడా భర్తీ చేయాలి. ఆ తర్వాత ఈ రంగాల్లో అదనపు పోస్టులను మంజూరు చేయాలి. అప్పుడు పతనమౌతున్న మన విద్యా, వైద్య ప్రమాణాలను నిలబెట్టగలుగుతాం. వాటితోబాటు ఇప్పుడు ఉనికిలో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలి. దానికి విధించిన పరిమితులను ఎత్తివేయాలి. గ్రామాల్లో ఎంతమంది పని కావాలని అడిగితే అంతమందికీ పనులు కల్పించాలి. ఆ పథకాన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి. ఆ పథకం కింద చెల్లించే వేతనాలను కూడా సహేతుకంగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలి.

ఈ మూడూ చేస్తే దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక రకాల వినిమయ సరుకులకు డిమాండ్ బాగా పెరుగుతుంది. ఇప్పుడున్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి స్థాయి మేరకు వినియోగించగలుగుతాం. అంతేకాక అదనపు సామర్థ్యాన్ని కూడా నెలకొల్పవలసిన పరిస్థితి వస్తుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో అభివృద్ధికి ఇది దారి తీస్తుంది (ఆ పరిశ్రమలకు అవసరమైన రుణ సదుపాయాలను కూడా కల్పించాల్సి వుంటుంది). అంటే, ప్రభుత్వం తన వ్యయం ద్వారా కల్పించే అదనపు ఉపాధి వలన ప్రైవేటు రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ప్రభుత్వం చేసే ఈ అదనపు వ్యయానికి కావలసిన ఆర్థిక వనరులను సమీకరించడానికి పెట్టుబడిదారుల మీద, తక్కిన బడా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలి. వారి ఆదాయాలమీద, వారి దగ్గర వున్న సంపద మీద పన్నులు విధించాలి. ముఖ్యంగా వారి స్థిరాస్తుల మీద, వారి నగదు నిల్వల మీద (షేర్ల రూపంలో ఉన్నవాటితో సహా) అదనపు పన్నులు వేయాలి. దానివలన వారు పెట్టే పెట్టుబడులు ఏమీ తగ్గిపోవు. సంపదమీద పన్ను సమర్థవంతంగా వసూలు కావాలంటే వారసత్వ పన్ను కూడా అదే సమయంలో విధించాలి. మన దేశంలో ఇప్పుడు సంపద పన్ను కాని, వారసత్వ పన్ను కాని అమలు చేయడంలేదు. నయా ఉదారవాద శకంలో కొద్దిమంది దగ్గర విపరీతంగా సంపద పోగుబడుతున్నప్పుడు, అసమానతలు విపరీతంగా పెరుగుతున్నప్పుడు ఈ మాదిరి పన్నులు అసలే లేకపోవడం దిగ్భ్రాంతికరం. అదే సమయంలో ఈ రెండు రకాల పన్నులనూ ఇప్పటి నుంచైనా అమలు చేస్తే ప్రభుత్వం దగ్గర పెద్ద మోతాదులో ఆర్థిక వనరులు సమకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టంగా కనపడుతోంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే తక్షణ పరిష్కారం. ఆ అదనపు ప్రభుత్వ వ్యయానికి కావలసిన వనరులను సమీకరించడానికి సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడమే సముచిత మార్గం. దీనివలన ఒకే దెబ్బకు అనేక పిట్టల్ని కొట్టవచ్చు. ఒకటి: ఉద్యోగాలు పెరుగుతాయి, రెండు: సంపద అసమానతలు పెరిగిపోకుండా అదుపులో ఉంటాయి. తద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుంది, మూడు: విద్యా, వైద్య ప్రమాణాలు మన దేశంలో మెరుగుపడతాయి.

(స్వేచ్ఛానుసరణ)

అంతర్జాతీయం


ఐరోపా పార్లమెంటు ఎన్నికలు
పెరిగిన నాజీ, ఫాసిస్టుల ముప్పు !

> **ఐరోపా యూనియన్ లోని 27 దేశాలలో జూన్ ఆరు నుంచి తొమ్మిదవ తేదీ వరకు జరిగిన యూనియన్ పదవ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఆందోళనకర సూచనలు వెలువడ్డాయి. అధికారికంగా ఫలితాల పూర్తి ప్రకటన వెలువడలేదు. నాలుగు దేశాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి అందిన సమాచారం, ఫలితాల తీరుతెన్నుల ప్రకారం నయా నాజీ, ఫాసిస్టు, పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ పరిణామం ఐరోపా విధానాలనే తీవ్రంగా ప్రభావితం చేసేదిగా ఉంది.**



ఐరోపా యూనియన్ లోని 27 దేశాలలో జూన్ ఆరు నుంచి తొమ్మిదవ తేదీ వరకు జరిగిన యూనియన్ పదవ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఆందోళనకర సూచనలు వెలువడ్డాయి. అధికారికంగా ఫలితాల పూర్తి ప్రకటన వెలువడలేదు. నాలుగు దేశాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి అందిన సమాచారం, ఫలితాల తీరుతెన్నుల ప్రకారం నయా నాజీ, ఫాసిస్టు, పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ పరిణామం ఐరోపా విధానాలనే తీవ్రంగా ప్రభావితం చేసేదిగా ఉంది. వివిధ దేశాలలో పాలక పార్టీలు, కూటములకు ఎదురు దెబ్బలు తగిలాయి. ఐరోపా సమాఖ్య వైఖరిలో వచ్చే మార్పులు, చేర్పుల గురించి చర్చ ప్రారంభమైంది.

పార్లమెంటులోని మొత్తం 720 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజారిటీ 361 స్థానాలు సాధించిన కూటమి ఎంచుకున్న నేత ఐరోపా కమిషన్ అధ్యక్ష పదవిని అధిష్టిస్తారు. కమిషన్ విధానాలను ఐరోపా పార్లమెంటు రూపొందిస్తుంది. ప్రతిదేశానికి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.



ఎం. కోటేశ్వరరావు

ఈ ఎన్నికలలో ప్రస్తుతం సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న ఉర్సులా వాండరె లెయన్ నాయకత్వంలోని యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి) 191 సీట్లతో పెద్ద పక్షంగా అవతరించింది. పచ్చి మితవాదులను అధికారంలోకి రాకుండా నిరోధించగలమని ఆమె చెప్పింది. మరోసారి ఆమె సమాఖ్య అధ్యక్ష స్థానం కోసం పోటీలో ఉన్నారు. ఐరోపా రాజకీయ పరిభాషలో ఇపిపిని మధ్యేవాద మితవాద పార్టీగా పరిగణిస్తారు. ఫ్రాన్సులో మారిన్ లీపెన్స్ నాయకత్వంలోని పచ్చి మితవాద ఐడెంటిటీ (ఉనికి)-డెమోక్రసీ (ప్రజాస్వామ్య) పార్టీ(ఐ.డి)కి 57 వచ్చాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ నాయకత్వంలోని యూరోపియన్ కన్జర్వేటివ్, రిఫార్మిస్టు (ఇసిఆర్) పార్టీకి 71 వచ్చాయి. ఈ మూడు పక్షాలూ గతం కంటే ఎక్కువ సీట్లు తెచ్చుకున్నాయి. సోషలిస్టు మరియు డెమొక్రాట్స్ కూటమి (ఎస్.డి) రెండవ పెద్ద పక్షంగా 135 సీట్లు తెచ్చుకుంది. గుర్తింపు పొందని చిన్న పక్షాలు 95 గెలుచుకున్నాయి. గ్రీన్స్ పార్టీ 53, రెన్యూ (పునరుద్ధరణ) యూరోప్ (ఆర్.ఇ) 83, ఐరోపా వామపక్ష పార్టీ 35 సీట్లు తెచ్చుకుంది. గత ఎన్నికల్లో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలిగా ఉర్సులా వాండెర్ లెయాన్ అభ్యర్థిత్వాన్ని సమర్థించి గెలిపించిన పార్టీలు తాజా ఎన్నికల్లో 720కి గాను 402 స్థానాలను తెచ్చుకున్నట్లు వెల్లడైంది. అందువలన ఆమె తిరిగి మరోసారి అదే పదవిలో కొనసాగవచ్చు. ఆమె గనుక పచ్చి మితవాద పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తే తాము దూరంగా ఉంటామని, ఉదారవాద, మితవాద పార్టీల ప్రతినిధులు హెచ్చరించారు. ఆమె బలహీన పడిన గ్రీన్స్, ఇటలీ మితవాది మెలోనీ పార్టీ మద్దతు కోరవచ్చని కొందరు విశ్లేషకులు జోశ్యం చెప్పారు. హంగరీలో జాతీయవాద నేత విక్టర్ ఒర్బాన్ పార్టీ బలం తగ్గినా 44 శాతం తెచ్చుకుంది. ఇటలీలో మితవాద ప్రధాని మెలోనీ పార్టీ 30 శాతం తెచ్చుకుంది.

ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈ నెల 30, జులై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మాక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మారిన్ లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మారియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చి మితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మారియో వ్యాఖ్యానించింది. మాక్రాన్ నాయకత్వాన్ని వ్యతిరేకించే మితవాద పార్టీలు మేరీ లీపెన్, మార్చెల్‌తో కలిసే అవకాశాలు ఉన్నాయి. వివిధ పార్టీలలో చీలికలు తెచ్చి తనవైపు తిప్పుకొనేందుకు మాక్రాన్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాడు. అతగాడి అధ్యక్ష పదవీకాలం 2027 వరకు ఉంది. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉంటే ఇబ్బంది కనుక వాటిని అడ్డుకొనేందుకు సర్వశక్తులూ వడ్డాలని చూస్తున్నాడు. సోషలిస్టులు, గ్రీన్స్, మరికొన్ని వామపక్ష పార్టీలు కూడా కూటమిగా ఏర్పడేందుకు చూస్తున్నాయి. ఐరోపా యూనియన్ ఎన్నికలలో సోషలిస్టు పార్టీ (పిఎస్)కు 14 శాతం ఓట్లు వచ్చాయి. కొన్ని సర్వేల ప్రకారం ప్రస్తుతం ఉన్న సీట్లలో మాక్రాన్ నాయకత్వంలోని రినైజాన్స్ పార్టీ (ఆర్.ఎన్) సగం స్థానాలను కోల్పోనున్నట్లు వెల్లడైంది.

జర్మనీలో పాలక కూటమిలోని సోషల్ డెమొక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి) 13.9 శాతం ఓట్లు తెచ్చుకొని మూడవ స్థానంలో ఉంది. పచ్చి మితవాద పార్టీ ఏఎఫ్‌డి 16 శాతం తెచ్చుకొని చరిత్ర సృష్టించింది. ప్రతిపక్ష క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్-క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి 30 శాతం తెచ్చుకొని ప్రథమ స్థానంలో ఉంది. తూర్పు జర్మనీ ప్రాంతంలో ఎఎఫ్‌డి అగ్రస్థానంలో ఉంది. సంకీర్ణ కూటమిలోని సోషల్ డెమొక్రాట్స్ (ఎస్‌పిడి), పర్యావరణ గ్రీన్స్, ఫ్రీ డెమొక్రాట్స్ పార్టీలు వరుసగా 13.9-11.9-5.2 శాతాల చొప్పున తెచ్చుకొని చావు దెబ్బతిన్నాయి. దీంతో వెంటనే ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. నాలుగింట మూడు వంతుల మంది జనం కూటమి పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని ఎన్నికల సర్వేలు వెల్లడించాయి.

ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో జరుగుతున్న పరిణామాలు, ఐరోపా అంతటా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం వంటి అంశాలన్నింటి కారణంగా మరింత భద్రత కావాలని ఓటర్లు కోరుకున్నారని, దాని మీద పచ్చి మితవాదులు వాగ్దానం చేశారని, ఈ ఎన్నికలు జాతీయ నాయకుల మీద జరిగిన ప్రజాభిప్రాయ వెల్లడి అని ఐరోపా సమాఖ్య విదేశీ సంబంధాల డిప్యూటీ డైరెక్టర్ వెసెలా టెక్నర్‌నెవా అన్నారు. ఐరోపాలో ఫాసిస్టు, నాజీ, పచ్చి మితవాద శక్తులు పుంజుకోవటమే కాదు, తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న ధోరణి కనిపిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో అనేక మంది ఊహించిన మాదిరి అవి ఎక్కువ బలాన్ని పెంచుకోలేదు. మూడో వంతు సీట్లు తెచ్చుకోవటం రానున్న ముప్పును వెల్లడిస్తున్నది. ఇప్పటివరకు అనేక కారణాలతో వివిధ దేశాల్లోని ఈ శక్తుల మధ్య ఐక్యత లేదు, అసంఘటితంగా కూడా ఉన్నాయి. ఎవరికి వారుగానే పని చేస్తున్నారు. మితవాదులు, పచ్చి మితవాదులకు స్వల్ప తేడాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న పూర్వ రంగంలో పార్లమెంట్‌లో ఈ శక్తులు కలిస్తే పరిణామాలు ఎలా వుండేదీ చెప్పలేము. ఒక వేళ అదే జరిగితే వాటిని వ్యతిరేకించే వారందరూ ఒక కూటమిగా ఏర్పడవచ్చు, వారితో వామపక్షాలు కూడా చేతులు కలిపే అవకాశం లేకపోలేదు. పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకోవటం వలన పర్యావరణ, వలసలు, ఉక్రెయిన్‌కు సాయంతో సహా విదేశాంగ విధానంలో మార్పుల కోసం పట్టు పట్టవచ్చు, వేగంగా నిర్ణయాలు తీసుకోవటాన్ని అడ్డుకోవచ్చు.

జనవాక్యం

చెరువు భూముల రీ సర్వే!

రాష్ట్రం లోని చాలా ప్రాంతాల్లో గత అయిదు సంవత్సరాలుగా చెరువులు, కుంటలు ప్రభుత్వ పెద్దల సహకారంతో ఆక్రమణలకు గురయ్యాయి. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కొన్ని చోట్ల వారి సహకారంతో కూడా ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. మరికొన్ని చోట్ల ఇళ్ల స్థలాలకు కూడా కేటాయింపులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. చెరువులు ఆక్రమణలకు గురైతే పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా నీటి వనరులు లేకుండా పోయే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర నీటి కొరత ఎదుర్కోవలసిన దుస్థితి దాపురిస్తుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెరువు భూముల సమగ్ర రీ సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలి. అంతే కాకుండా చెరువులకు వర్షపు నీరు పారే వాగులు, వంకలను కూడా ఆక్రమణల నుంచి కాపాడాలి. ఆక్రమణలకు బాధ్యులను గుర్తించి శిక్షించాలి. అప్పుడే ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు.

రాష్ట్రానికి రూ.5,656 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి రూ.5,656 కోట్లు వచ్చాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ నుంచి రాష్ట్రానికి లేఖ అందింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.2.79 లక్షల కోట్లు విడుదల చేయగా, అందులో జూన్ నెలకు సంబంధించి 1,39,750 కోట్లు విడుదలయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనున్నవేళ ఈ నిధులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా జూలై ఒకటో తేదీన పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్లకు ఈ నిధులు మేలు చేస్తాయని అంటున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రమాణ స్వీకారానికి వైసిపి దూరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి దూరంగా వుండాలని వైసిపి నిర్ణయించినట్లు తెలిసింది. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రమాణస్వీకారానికి హాజరుకావాలని నారా చంద్రబాబునాయుడు మంగళవారం ఫోన్ ద్వారా ప్రయత్నించినా..జగన్ అందుబాటులోకి రాలేదని టిడిపి నేతలు తెలిపారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కాకపోవడంతో పాటు టిడిపి దూరంగా వున్న తీరులోనే తమపార్టీ ప్రమాణస్వీకారానికి దూరంగా వుంటోందని వైసిపి నేతలు పేర్కొన్నారు.

జగన్‌తో పలువురు భేటీ

రాష్ట్రంలో దారుణ ఓటమిని జీర్ణించుకోలేని వైసిపి నాయకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఫలితాల వెలువడిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నేతలు జగన్‌ని కలిసి సంఘీభావం తెలుపుతున్నారు. మంగళవారం కూడా పలువురు నేతలు తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డిని నివాసంలో కలిశారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, మేరుగ నాగార్జున, రిటైర్డ్ ఐఎఎస్, కర్నూలు నియోజకవర్గం నుండి పోటీచేసి ఓటమిపాలైన ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, జక్కంపూడి రాజా తదితరులు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినవారిలో వున్నారు.

మీడియా అణిచివేతపై చర్యలు తీసుకోండి

- ట్రాయ్‌కు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో టివి ఛానెళ్లపై అణిచివేత జరుగుతోందని, తక్షణమే జోక్యం చేసుకోవాలని వైసిపి రాజ్యసభ సభ్యులు ఎస్ నిరంజన్‌రెడ్డి ట్రాయ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ట్రాయ్ ఛైర్మన్, కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి, సెక్రటరీలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కేబుల్ ఆపరేటర్ల అసోషియేషన్ టివి9, ఎన్‌టివి, 10 టివి, సాక్షి టివి ప్రసారాలను అకారణంగా అక్రమంగా నిలిపివేస్తూ చర్యలు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యూస్ ఛానెళ్ల ప్రసారాలను నిలిపేయడం సుప్రీం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని తెలిపారు. తక్షణమే రాష్ట్రంలో టివి ఛానెళ్లపై అణిచివేతపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబు సహకారంతో పరిశ్రమల ఏర్పాటు

- కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో ఒక్క పరిశ్రమ రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

టిటిడి ఛైర్మన్ రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడిఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మంళవారం ఆయన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ నోటిఫికేషన్ ఇచ్చారు.

అమిత్ షాకు చంద్రబాబు విందు

- ఇరువురు నేతల భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు బుధవారం నాల్గవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో పలువురు ప్రముఖులు మంగళవారంనాడే విజయవాడకు చేరుకున్నారు. ఢిల్లీనుండి వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందరేశ్వరి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్, బిజెపి నేతలు సిఎం రమేష్, సుజనా చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర కేబినెట్‌లో బిజెపి నుండి ఎవరు వుండాలనే అంశంపై చర్చించేందుకు అమిత్‌షా విమానాశ్రయం నుండి నేరుగా ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. దాదాపు గంట పాటు ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. అనంతరం చంద్రబాబు నివాసంలోనే అమిత్ షాకు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాతో పలువురు ఎన్‌డిఎ నేతలు పాల్గొన్నట్లు తెలిసింది.

విజయవాడ చేరుకున్న చిరంజీవి ప్రభృతులు

విశిష్ట అతిథిగా హాజరుకానున్న ప్రముఖ నటుడు చిరంజీవి కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుండి విజయవాడకు చేరుకున్నారు. ఆయనతో పాటు చంద్రబాబు స్నేహితుడు, ప్రముఖ నటుడు రజనీకాంత్ విజయవాడ చేరుకున్నారు. ఢిల్లీ నుండి పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు విజయవాడకు చేరుకున్నారు. అలాగే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, సింగపూర్, జపాన్, నెదర్లాండ్స్, దక్షిణకొరియా దేశాల కాన్సులేట్ నుండి ప్రతినిధులు మంగళవారం రాత్రే విజయవాడ విచ్చేశారు. అలాగే నారా, నందమూరి కుటుంబాల నుంచి పలువురు ఇప్పటికే చంద్రబాబు ఇంటికి చేరుకున్నారు.



ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన కుటుంబ సభ్యులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జెపి నడ్డా

కార్యకర్తలను కలవకపోవడమే కొంపముంచింది

- వైసిపిలో అంతర్మథనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికారంలో ఉన్న ఐదేళ్లలో కిందిస్థాయి నాయకలను, కార్యకర్తలను నేరుగా కలకవపోవడమే కొంపముంచిందని వైసిపి అధినాయకత్వం అభిప్రాయపడిందని తెలిసింది. ఎన్నికల్లో ఘోర ఓటమి అనంతరం జిల్లాల వారీగా, ముఖ్య నాయకులతోనూ చర్చల్లోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను కూడా సిఎం వద్దకు వెళ్లకుండా కోటరీలోని కొందరు అడ్డుకున్నారనే అభిప్రాయాన్ని కొద్దిరోజులుగా జరుగుతున్న సమావేశాల్లో ఎక్కువమంది నాయకులు వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనికి కొందరు సలహాదారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు కొంత వాగ్వాదం కూడా జరిగినట్టు చెబుతున్నారు. గతంలో కొందరు ప్రజా ప్రతినిధులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెడితే, అందరు తన వద్దకు నేరుగా వస్తే మీరుండేది దేనికని, మీ ప్రాధాన్యత ఏమిటని జగన్ ప్రశ్నించారని, 'మీరే చూసుకోండి' అని అన్నారని ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఒక సలహాదారు అన్నట్లు సమాచారం. దీనికితోడు గ్రామ పంచాయతీల్లో నిధులు తీసేసుకోవడం వల్ల సర్పంచులందరూ పార్టీలకు అతీతంగా ఏకమయ్యారని, అది కూడా నష్టం కలిగించిందనే అభిప్రాయానికి ఈ సమీక్షల్లో వచ్చారు. కిందిస్థాయి నాయకత్వాన్ని పట్టించుకోకపోవడంతో వారు కూడా ఎన్నికల్లో సహకరించలేదని నిర్ధారణకు వచ్చారు. మరోవైపు మీడియాను చులకనగా చూడటం వల్ల ప్రజలు కూడా కొంత ఆందోళనకు గురయ్యారని నలుగురు మాజీ మంత్రులు అన్నట్లు తెలిసింది. పదే పదే మీడియాను టార్గెట్ చేయడం, అదే సమయంలో ఎక్కువగా పోలీసు వేధింపులు పెరగడం వల్ల సామాన్యులు భయపడ్డారని ఇది తీవ్రంగా నష్టం కలిగించిందన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది.

జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పవన్‌కల్యాణ్ పేరును ప్రతిపాదించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా బలపరిచారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన తరపున గెలిచిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ప్రజలందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదని, పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కానే కాదన్నారు. ప్రజలు జనసేన పార్టీని నమ్మి పెద్ద బాధ్యతను అప్పజెప్పారని, వారి నమ్మకానికి తగ్గస్థాయిలో సేవచేయాలన్నారు. తనతో పాటు గెలిచిన ఎమ్మెల్యేలంతా దానిని బాధ్యతగా తీసుకుందామన్నారు. ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాల్లో ప్రాధాన్యతా అంశాలను గుర్తించాలని, ఏయే అంశాలు మొదటి ప్రాధాన్యత అంశాల్లో తెలుసుకోవాలని పవన్‌కల్యాణ్ సూచించారు. ఒక వేళ కేంద్రంతో ముడిపడిన అంశాలుంటే కేంద్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ ఎన్నికల్లో విద్య, వైద్యం, ఉపాధి, భద్రత, సాగు, తాగు, నీరు కల్పిస్తామని ప్రజలకు పూర్తి స్థాయిలో హామీనిచ్చామని, అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో హామీలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలందరూ కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహేతుకంగా ఉండాలని, వ్యక్తిగతంగా ఎవరూ మాట్లాడవద్దని పవన్‌కల్యాణ్ పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ చారిత్రిక విజయం అందుకుని మొదటి శాసనసభాపక్షం సమావేశం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పవన్‌కల్యాణ్ చిత్తశుద్ధి, రాష్ట్రం కోసం తపించిన విధానం మనల్ని గెలిపించాయన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరుగురు నిందితులపై చార్జిషీటు

- పరారీలో ఇద్దరు నిందితులు
- వ్యూహప్రకారమే ట్యాపింగ్ చేశారని అభియోగం
- ఇద్దరు నిందితుల బెయిల్‌పై నేడు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ స్కామ్‌లో మొత్తం ఆరుగురు నిందితులపై మంగళవారం నాంపల్లి కోర్టులో కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట స్పెషల్ టీమ్ అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్ఐబి మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, అదనపు ఎస్పిలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి, ఎస్ఐబీ మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఛానల్ సిఇఒ శ్రవణ్‌కుమార్‌పై చార్జిషీట్ దాఖలైంది. అందులో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ పరారీలో ఉన్నట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు విపక్షాలకు చెందిన పలువురు నాయకులు, వ్యాపారులు, సెలబ్రెటీలు, ప్రముఖులు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లపై ఒక వ్యూహం ప్రకారం పై నిందితులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు. ముఖ్యంగా ఎస్ఐబి మాజీ ఐజి ప్రభాకర్‌రావుతో పాటు మరికొందరు టీమ్‌గా ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో విపక్షాలకు చెందిన వారి నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడి భారీ మొత్తంలో వారికి చెందిన కోట్ల రూపాయల డబ్బులను సీజ్ చేశారని చార్జిషీట్‌లో వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ఐబి కార్యాలయంలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి పదిహేడుకుపైగా కంప్యూటర్లతో వాటికి అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫోన్ ట్యాపింగ్ పరికరాలను అమర్చి మరీ ఆపరేషన్లకు పాల్పడ్డారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. వీరంతా కలిసి దాదాపు 1400 వందల మందికిపైగా ప్రముఖుల ఫోన్లట్యాపింగ్‌కు పాల్పడినట్టు తెలిపారు. ముఖ్యంగా ప్రభాకర్‌రావు ఆదేశాలు, సూచనల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిపామనీ, ఐన్యూస్ సిఇఒ శ్రవణ్‌కుమార్ కూడా కీలక పాత్ర పోషించారని పట్టుబడ్డ నిందితులు తమ వాంగ్మూలం ఇచ్చినట్టు కూడా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతేడాది డిసెంబర్ నెలలోనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌లకు సంబంధించిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు, సాంకేతిక పరికరాలను ధ్వంసం చేసి నిందితుల్లో ఒకరైన ప్రణీత్‌రావు ఆ సామాగ్రిని మూసీ నదితో పాటు బేగంపేట కాలువలో పారేసి ఆధారాలను మాయం చేయడానికి కుట్ర పన్నారని చార్జిషీట్‌లో తెలిపారు. గత మార్చి పదో తేదీన ఈ కేసుపై ఎఫ్ఐఆర్ నమోదైన దానికంటే కొద్ది రోజుల ముందు మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ దేశం విడిచి పారిపోయారనీ, వారి కోసం రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ కేసులో మరిన్ని నిజాలతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించిన అప్పటి ప్రభుత్వ ప్రముఖుల వివరాలు బయటపడే అవకాశాలుంటాయని ఈ చార్జిషీట్‌లో సూచనప్రాయంగా తెలిపినట్టు సమాచారం.

బెయిల్‌పై నేడు నిర్ణయం

ఇదిలా ఉంటే ఈ కేసులో నిందితులైన అదనపు ఎస్పిలు భుజంగరావు, తిరుపతన్నలకు బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టు నేడు నిర్ణయం తీసుకోనున్నది. మంగళవారం వీరిద్దరికీ బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో పాటు నిందితుల తరపు న్యాయవాదుల మధ్య వాదప్రతివాదనలు జరిగాయి. కాగా, ఈ కేసులో ఇద్దరు అధికారులను ఉద్దేశపూర్వకంగా నిందితులుగా చేర్చారనీ, వారికి బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుల తరపు న్యాయవాదులు వాదించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు పలు ఆధారాలున్నాయనీ, ఈ నేపథ్యంలో వీరిద్దరి నిందితులకు బెయిల్ లభిస్తే వారు ఆధారాలను తారుమారు చేసే ప్రమాదముందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వీరి వాదనలు విన్న న్యాయమూర్తి వారిద్దరి బెయిల్ మంజూరుపై నిర్ణయాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశారు.





చంద్రబాబు కాన్వాయ్ వెంట మహిళ పరుగులు

- కారు ఆపి మాట్లాడిన టిడిపి అధినేత

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

ఎన్‌డిఎ కూటమి శాసనసభ్యుల సమావేశానికి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడును చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు దారి పొడవునా స్వాగతం పలికారు. విజయవాడ నగరంలోని ఎ కన్వెన్షన్లో బుధవారం కూటమి సమావేశం జరిగింది. అనంతరం ఉండవల్లిలోని స్వగృహానికి ప్రయాణమైన చంద్రబాబును చూసేందుకు మదనపల్లికి చెందిన ఓ మహిళ కాన్వాయ్ వెంట పరుగులు పెట్టారు. ఆ మహిళను కారులోంచి చూసిన చంద్రబాబు వెంటనే కాన్వాయ్‌ను ఆపి, ఆ మహిళను దగ్గరకు పిలిచి మాట్లాడారు.

తనది మదనపల్లి అని, తన పేరు నందిని అని చెప్పిన ఆ మహిళ చంద్రబాబుపై అభిమానంతో చూడడానికి వచ్చానని తెలిపారు. ఆ మహిళతో చంద్రబాబు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 'మా కష్టం ఫలించి మా కోరిక మేరకు మీరు సిఎం అయ్యారు సార్. ఒక్కసారి మీ కాళ్ల మొక్కుతాను' అంటూ ఆ మహిళ అనగా, చంద్రబాబు సున్నితంగా వారించారు. ఆప్యాయంగా పలకరించి ఆమెతో ఫొటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడాలని వచ్చానని నందిని చెప్పగా, ముందు ఆస్పత్రికి వెళ్లాలని ఆమెకు చంద్రబాబు సూచించారు.

'కూటమి' పక్ష నేతగా బాబు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధిని సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. విద్య వైద్యం, ఉపాధి, తాగు, సాగునీరు, శాంతి భద్రతలు అన్నింటా అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చామని, ఆ మాటలను నిలబెట్టుకోవాల్సి ఉందన్నారు. బాబు జైలులో ఉన్నప్పుడు ఆయన సతీమణి భువనేశ్వరి బాధను చూశానని, కన్నీరు పెట్టవద్దని మంచి రోజులు వస్తాయని చెప్పానని, ఇప్పుడు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించేందుకు ప్రజలు కసిగా ఓట్లు వేశారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురేంధేశ్వరి అన్నారు. విజయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సి అవసరం ఉందన్నారు.

సెక్రటేరియట్ ఉద్యోగ సంఘంలో ఆధిపత్య పోరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం మారిన నేపథ్యంలో సెక్రటేరియట్ ఉద్యోగ సంఘంలో ఆధిపత్య పోరు ప్రారంభమైంది. వెంకట్రామిరెడ్డి ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా ఉండగా ఆయన ఏర్పాటు చేసిన బి టీం మరలా పెత్తనంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తోందన్న వార్తలు రాష్ట్ర సచివాలయంలో వ్యాపిస్తున్నాయి. దీంతో మంత్రివర్గ ప్రమాణ స్వీకారం అనంతరం ఉద్యోగులు సమావేశం కావాలని భావిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి తనకు వ్యతిరేకంగా తనే ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకుని అధికారం చేజారి పోకుండా చేసుకుంటున్నారన్న అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులకు ఫిర్యాదులు వెళ్లాయని తెలిసింది. ఉద్యోగుల్లో అంతర్గతంగా ఉన్న అసహనం కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం సచివాలయంలో విస్తృతంగా చర్చ జరిగింది. మూడో బ్లాకు వద్ద స్వల్పంగా వాగ్వివాదం కూడా జరిగినట్లు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉద్యోగ వ్యవహారాలు చూస్తున్న ఒకరిద్దరు నాయకులు ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

'ఉక్కు' రక్షణకు మంత్రులు కృషి చేయాలి

- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కొత్తగా ఎన్నికైన మంత్రులు తమ వంతు కృషి చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1216వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు పరంధామయ్య, విళ్లా రామ్మోహన్ కుమార్ మాట్లాడారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా రాష్ట్రం నుంచి ఎంపిగా ఎన్నికైన శ్రీనివాసవర్మ బాధ్యతలు స్వీకరించడంతో ప్లాంట్‌కు మేలు జరుగుతుందని భావిస్తున్నామని, విశాఖ ఉక్కుపై స్పందించాలని కోరారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ కేపిటల్ సమకూర్చాలని కోరారు. దేశంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలకు ట్యాక్స్ హాలీడే ప్రకటించారని, అదే విధంగా విశాఖ ఉక్కుకు కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల వేతనాలను కార్మికులకు త్వరితగతిన ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు డియుఎస్‌వి.శ్రీనివాసరాజు, ఎన్‌వి.సాయి నాగబాబు, వేణుగోపాలరావు, దాసరి శ్రీనివాసరావు, జోషి, కె.మధుసూదన్‌రావు, వి.వెంకటరమణ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్‌డి ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్యకర్తలు

ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ఎమ్‌డి ఆఫీసు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఎన్నికల కోడ్ పేరుతో అక్రమంగా సస్పెన్షన్‌లో వుంచిన ఉద్యోగులపై తక్షణమే ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్‌టిసి ఎమ్‌డి కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని భాషా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల నిబంధనావళి పేరుతో 154 మంది ఆర్‌టిసి ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలను తీసుకున్నారని తెలిపారు. ఇందులో 51 మందిని సస్పెండ్ చేశారని విమర్శించారు. ఎంసిసి పరిధిలోకి రాని ఆర్‌టిసి ఉద్యోగులను సస్పెండ్ చేయడం తగదన్నారు. ఏలూరులో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జరిగిన సమావేశంలో పాల్గొన్నందుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య పైన మాత్రమే చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు? అదే సమావేశంలో అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నా.. వారెవరిపై చర్యలు లేవని, ఇలాంటి అక్రమ సస్పెన్షన్లు తక్షణమే ఎత్తివేయాలని కోరారు. అక్రమంగా సస్పెండ్ చేసిన డిపిటిఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు భాస్కర్‌రావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకులు డిపిఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారులపై ఎసిబి దర్యాప్తు

- ప్రభుత్వానికి బిల్డర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో కొంతమంది అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ బిల్డర్లను ఇబ్బందిపెడుతున్నారని నెరెడ్కో, క్రిడాయ్ సంస్థలతో పాటు లైసెన్స్డ్ ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. కమిషనర్, సిటీప్లానర్, డిప్యూటీ సిటీప్లానర్ అవినీతి అక్రమాలపై విజిలెన్సు, ఎసిబితో విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నగర ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరారు. గుంటూరులో ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో నెరెడ్కో అధ్యక్షులు వి.నాగ వంశీ, కార్యదర్శి ఎం.సీతారామయ్య, నాయకులు పి.వి.మల్లికార్జునరావు, యాగంటి దుర్గా ప్రసాద్, క్రిడాయ్ అధ్యక్షులు మామిడి రాము, నాయకులు డి.శ్రీనివాసరావు, ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నాగ శ్రీనివాసరావు మాట్లాడారు. బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో కమిషనర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదన్నారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీలో కూడా తీవ్ర జాప్యం చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం రాకపోవడంతో పాటు తమ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.

ఒకరిని కాపాడబోయి మరొకరు..

- విద్యుదాఘాతంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)

విద్యుదాఘాతానికి గురైన ఒకరిని కాపాడబోయి మరొకరు మరణించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. మండల పరిధిలోని ఇబ్రహీంపేట ఎస్సి కాలనీకి చెందిన కోనేటి గంగమ్మ (65) తన ఇంటిలోని ఫ్రిడ్జ్ తెరిచేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురవ్వడంతో ఆమె గట్టిగా అరిచారు. పక్కింట్లో ఉండే కొండయ్య (51) ఆమెను కాపాడబోయి తాను విద్యుదాఘాతానికి గురయ్యారు. గంగమ్మ అక్కడికక్కడే మరణించారు. కొండయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. గంగమ్మ ఒంటిమిట్ట సిపిఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య తల్లి. గ్రామంలో తరచూ విద్యుత్ లో, హై ఓల్టేజీ సమస్య ఉందని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఘటనకు విద్యుత్ అధికారులు బాధ్యత వహించి ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ డిమాండ్ చేశారు. నరసయ్య కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యువకుని హత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

మద్యం మత్తులో స్నేహితులే తమ స్నేహితుడిని హత్య చేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తిరుపతి శివారు కరకంబాడి కాలనీకి చెందిన అమర్నాథ్ (30) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఆయన మద్యం తాగారు. మద్యం మత్తులో అమర్నాథ్ సెల్‌ఫోన్‌ను ఆయన స్నేహితులు తీసుకున్నారు. ఇంటికి వెళ్లి భార్యతో జరిగిన విషయం చెప్పడంతో ఆమె వచ్చి వారిని నిలదీశారు. మాటామాట పెరగడంతో గొంతు మీద కాలుతో నొక్కి అమర్నాథ్‌ను హతమార్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అమర్నాథ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి 12 గంటలు

ప్రజాశక్తి -తిరుమల

వేసవి సెలవులు ముగియనుండడంతో తిరుమలలో యాత్రికుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో తిరుమలలోని 31 కంపార్టుమెంట్లు మంగళవారం నిండిపోయాయి. సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. స్వామివారిని సోమవారం 78,064 మంది దర్శించుకున్నారు. 33,869 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. యాత్రికులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.3.70 కోట్ల ఆదాయం వచ్చిందని టిటిడి అధికారులు తెలిపారు.

ధరల మంట!



- అమాంతం పెరిగిన కూరగాయల రేట్లు
- భారీగా అల్లం ధర
- అదే బాటలో టమాట, పచ్చిమిర్చి
- కలవరపెడుతున్న ఆకుకూరలు, పప్పు దినుసులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూరగాయలు, ఇతర వంట సరుకుల ధరలు సామాన్యుని వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. 'ఏం కొనేటట్టు లేదు.., ఏం తినేటట్టు లేదు' అన్నట్లుగా ప్రస్తుతం పరిస్థితి ఉంది. రిటైల్ మార్కెట్లో వారం రోజుల్లో కూరగాయల ధరలు భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని ధరలు రెండు, మూడు రెట్లు కూడా పెరిగాయి. ఆకుకూరల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. కూరగాయలు కొనే బదులు చికెన్ కొందామనుకుంటే ఆ అవకాశమూ కనిపించడం లేదు. కిలో చికెన్ రూ.250 పలుకుతుండడంతో జనం ఎటూ పాలుపోలేని స్థితిలో ఉన్నారు.

వారం క్రితం వరకూ టమాట కిలో రూ.20 ఉండగా, ప్రస్తుతం ఇది మూడింతలు పెరిగి రూ.60కు చేరింది. పచ్చిమిర్చిని ముట్టుకుంటే రేటు ఘాటు పుట్టిస్తోంది. వారం రోజుల క్రితం కిలో రూ.60 ఉండగా, ప్రస్తుతం రూ.100కు చేరింది. కేజీ ఉల్లి ధర గత వారం రూ.25 ఉండగా, ప్రస్తుతం రూ.50కు చేరుకుంది. కేజీ చిక్కుళ్ల ధర గత వారంలో రూ.40 ఉండగా, ప్రస్తుతం రూ.120కు చేరింది. క్యాప్సికమ్ కేజీ రూ.60 నుంచి రూ.100కు పెరిగింది. బీరకాయ ధర గత వారం రూ.60 ఉండగా, ప్రస్తుతం రూ.80కు చేరింది. అన్ని రకాల ఆకుకూరలు రూ.10కు మూడు కట్టలు ఇచ్చేవారు. ప్రస్తుతం రెండు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. రూ.10కు దొరికే కొత్తిమీర కట్ట ఇప్పుడు రూ.40కు చేరింది. అల్లం ధర సామాన్యునికి అందనంత ఎత్తుకు చేరింది. పది రోజుల క్రితం కేజీ అల్లం రూ.80కు దొరికేది. ప్రస్తుతం రూ.280కి చేరింది. దీంతో, అల్లం కొనుగోలును సామాన్యులు ఆపేశారు.

కిరాణా సరుకుల ధరలూ రెండింతలు పెంపు

పలు కిరాణా సరుకుల ధరలు సైతం సామాన్యుడికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. నిత్యం వంట గదిలో ఉండాల్సిన వస్తువుల ధరలు అందనంత దూరం ఉన్నాయి. నెల రోజుల క్రితం వంద గ్రాముల జీలకర్ర ధర రూ.40 ఉండగా, ఇప్పుడు రూ.68కు చేరింది. వెల్లుల్లి కేజీ రూ.90 ఉండగా, ప్రస్తుతం రూ.150 ఉంది. పప్పు దినుసుల ధరలు కూడా కేజీకి రూ.20 నుంచి రూ.40 వరకూ పెరిగాయి.

అకాల వర్షాల వల్ల తగ్గిన ఉత్పత్తి

అకాల వర్షాలతో పంటలకు నష్టం కలగడం వల్లే కూరగాయలు, ఆకుకూరల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలతో పలు పంటలు దెబ్బతిని ఉత్పత్తి భారీగా తగ్గిపోయింది. దీంతో, పంట కొరత ఏర్పడంతో రేట్లు అమాంతం పెరిగాయని కూరగాయల విక్రయదారులు చెబుతున్నారు. ఎండలు తగ్గడంతో ఇప్పుడిప్పుడే వేసిన కూరగాయల పంటలు ఇంకా చేతికి రాలేదు. మరో 20 రోజుల్లో ఈ పంటలు చేతికందే అవకాశం ఉంది.



మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి

ఫలించిన పోరాటం

- వేతన బకాయిలపై కమిషనర్ హామీ
- సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కార్మికుల పోరాటం ఫలించింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులతో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి మంగళవారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో, కార్మికులు సమ్మె విరమించారు. వేతన బకాయిలు ఈ నెలాఖరులోగా చెల్లిస్తామని కమిషనర్ ప్రసన్నవాణి హామీ ఇచ్చినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత కొద్ది నెలలుగా మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో కమిషనర్ చర్చలు జరిపారు. ఈ ఏడాది జనవరిలో ఉన్న రూ.3 వేల బకాయి వేతనాలు, సంక్రాంతికి ఇవ్వాల్సిన పండగ ఖర్చులు వెయ్యి రూపాయలు, ఫిబ్రవరి వేతన బకాయి రూ.6 వేలు చెల్లించేందుకు ఆమె అంగీకరించారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తోన్న డ్రైవర్లకు పెంచిన వేతనం రూ.24,500 వెంటనే అమలుకు ఒప్పుకున్నారు. ఈ చర్చల్లో ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు, పోత్రారాజు, టి.ఇందు పాల్గొన్నారు.



చికిత్స విధానాన్ని మీడియాకు వెల్లడిస్తున్న వైద్యులు

'అపోలో'లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు అపోలో ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. ఓ వృద్ధుడికి మూసుకుపోయిన కవాటాన్ని ఆపరేషన్ ద్వారా తిరిగి యథాస్థితికి తీసుకువచ్చారు. చికిత్స విధానాన్ని ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ప్రముఖ కార్డియాలాజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి మంగళవారం మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన నాగేశ్వరరావు (70) గత కొంతకాలంగా ఆయాసం, దగ్గు, ఛాతి నొప్పితో బాధపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో అపోలో ఆస్పత్రిలో చేరారు. వైద్య పరీక్షలు చేయగా ఆక్సిజన్ పల్స్ శాతం 80, హార్ట్ రేట్ 130, కిడ్నీ ఫంక్షన్ 2.3గా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అనంతరం ప్రముఖ కార్డియాలజిస్టు చిర్రా భక్తవత్సలరెడ్డి సూచనల మేరకు పూర్తి స్థాయిలో పరీక్షించగా అతని గుండె కవాటం మూసుకుపోయి ఉండడాన్ని గుర్తించారు. గుండెకు రక్తం సరఫరా చేసే కవాటం వాస్తవానికి ఏడు సెంటీమీటర్లు ఉండాల్సి ఉండగా ఐదు సెంటీమీటర్లు కుంచుకుపోయినట్లు నిర్ధారించారు. ప్రాణాపాయంతో కూడిన ఆపరేషన్ కావడంతో కుటుంబ సభ్యుల అనుమతితో బాధితుడికి ఆపరేషన్ చేశారు. బాధితుడి గుండెను పేస్‌మేకర్ ద్వారా నాలుగు సెకండ్లపాటు నిలిపివేసి, కాలు నరం ద్వారా వాల్వ్‌ను పంపి కవాటాన్ని తిరిగి యథాస్థితికి తీసుకువచ్చారు. నెల్లూరు అపోలో ఆస్పత్రిలో ఇటువంటి ఆపరేషన్ రెండవదని, మొట్టమొదటిసారి కావలికి చెందిన ఓ వ్యక్తికి మూడేళ్ల క్రితం ఇటువంటి ఆపరేషన్ నిర్వహించామని వైద్యులు తెలిపారు.



రాక్ సిరామిక్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

2వ రోజూ సిరామిక్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- సామర్లకోట(కాకినాడ జిల్లా)

తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కాకినాడ జిల్లా సామర్లకోట ఎడిబి రోడ్‌లోని రాక్ సిరామిక్ కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట రెండో మంగళవారం కూడా ధర్నా చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని, కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ కార్మికుల జీవితాలతో రాక్ పరిశ్రమ యాజమాన్యం ఆటలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి కారణమూ లేకుండా, ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా 25 మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. 15 ఏళ్లుగా ఫ్యాక్టరీనే నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను అర్ధాతరంగా తొలగిస్తే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రాక్ సిరామిక్స్ యాజమాన్యం నిబంధనలను, కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. కంపెనీ లాభాల కోసం కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ కార్మికుల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లోనూ క్లెయిమ్ సెటిల్‌మెంట్

- హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో వెల్లడి

ముంబయి : వాట్సాప్ ద్వారా కూడా తక్షణ మోటార్ క్లెయిమ్‌ల పరిష్కారాన్ని ప్రారంభించినట్లు బీమా సంస్థ హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తెలిపింది. తన డిజిటల్ ఫస్ట్ విధానానికి అనుగుణంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ ప్రత్యేక చొరవ తమ వినియోగదారులకు అవాంతరాలు లేని సేవలను అందించేందుకు, సాంకేతికతను వినియోగించుకోవడంలో కంపెనీ చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శమని ఆ సంస్థ డైరెక్టర్ పార్థనిల్ ఘోష్ తెలిపారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పిజి ఐజి నవనీత్ కుమార్ మెహతా

ప్రధాని రాకతో ఏర్పాట్లు కట్టుదిట్టం

- ఎస్‌పిజి ఐజి నవనీత్ కుమార్ మెహతా

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం కృష్ణా జిల్లా గన్నవరం పర్యటన నేపథ్యంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎస్‌పిజి ఐజి నవనీత్ కుమార్ మెహతా సూచించారు. గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధా టవర్స్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లపై మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో ముందస్తు భద్రత సమన్వయం (ఎఎస్ఎల్) నిర్వహించారు. ప్రత్యేక అధికారులు హరికిరణ్, డిఐజి గోపీనాథ్ జెట్టి, జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీమ్ అస్మి ఇతర పోలీసు అధికారులతో కలిసి ప్రధానమంత్రి కాన్వాయ్ రాకపోకలపై రూట్ మ్యాప్‌పై చర్చించారు. ఆ మార్గంలో గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రమాణ స్వీకార వేదిక వరకు ట్రయల్ రన్ కాన్వాయ్‌ను పరీక్షించారు. అదనపు ఎస్‌పి జి వెంకటేశ్వరరావు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఓలా ఎలక్ట్రిక్ ఐపిఒ..!

బెంగళూరు : ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ దరఖాస్తు చేసుకున్న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉందని ఆ వర్గాల సమాచారం. దీంతో దేశంలో ఐపిఒకు వెళ్తున్న ఇవి స్టార్టప్‌గా ఓలా ఎలక్ట్రిక్ నిలువనుంది. ఇష్యూ కోసం డిసెంబర్ 22న దరఖాస్తు చేసుకుంది. ఈ ఇష్యూలో షేర్లను జారీ చేయడం ద్వారా రూ.5,500 కోట్ల నిధులు సేకరించాలని ఓలా ఎలక్ట్రిక్ లక్ష్యంగా పెట్టుకుంది.




డిసిఐవి లాజిస్టిక్స్ నూతన సిఒఒగా ముత్తు మారుతాచలం

చెన్నయ్ : డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డిఐసివి) సబ్సిడరీ సంస్థ డైమ్లర్ ట్రక్ ఎజి ప్రెసిడెంట్, చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ లాజిస్టిక్స్ హెడ్‌గా ముత్తుమారుతాచలం సి నియమితులయ్యారు. ఆయన నియామకం ఆగస్ట్ 15 నుంచి అమల్లోకి వస్తుందని ఆ కంపెనీ తెలిపింది. సంస్థ నుంచి వైదొలగిన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అన్షుమ్ జైన్ స్థానంలో ఆయన్ను తీసుకున్నట్లు తెలిపింది. ముత్తుమారుతాచలం 2009లో డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించారు.

శ్రీలంకలోని పిక్‌మితో ఫోన్‌పే భాగస్వామ్యం

న్యూఢిల్లీ : శ్రీలంకలో భారతీయ పర్యాటకులకు నిరంతరాయ యుపిఐ ఆధారిత క్యూఆర్ చెల్లింపులకు వీలు కల్పించడం కోసం శ్రీలంకలోని ప్రముఖ రైడ్ హెయిలింగ్ (క్యాబ్ సర్వీసులు) ప్లాట్‌ఫారం పిక్‌మితో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని ఫోన్‌పే మంగళవారం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా బండారా నాయకే అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ప్రయాణికులు బయటకు వచ్చిన మరుక్షణం నుండి తమ పిక్‌మి రైడ్లపై క్యాష్‌లెస్ లావాదేవీల సౌకర్యం ద్వారా తమ ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచుకునేందుకు ఒక పెద్ద ముందడుగు పడిందని ఫోన్‌పే ఇంటర్నేషనల్ పేమెంట్స్ విభాగం హెడ్ రితేష్ పాయ్ తెలిపారు.



భారత వృద్ధి 7% లోపే..!

- యుబిఎస్ వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో భారత వృద్ధి రేటు 7 శాతం లోపే ఉండొచ్చని స్విస్ బ్రోకరేజీ దిగ్గజం యుబిఎస్ పేర్కొంది. 2025-26 నుంచి 2029-30 మధ్య ప్రతీ ఏడాది సగటున 6.5-7 శాతం మధ్య వృద్ధి చోటు చేసుకోవచ్చని విశ్లేషించింది. బిజెపికి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాకపోవడంతో మిత్రపక్షాల మద్దతుతో అధికారాన్ని చేపట్టిన ప్రధాన మంత్రి మోడీకి ఈ దఫా కీలక సంస్కరణలపై నిర్ణయం సవాలేనని యువిఎస్ చీఫ్ ఎకనామిస్ట్ తన్వీ గుప్తా పేర్కొన్నారు. కాగా.. 2024-25లో భారత జిడిపి 7.2 శాతంగా ఉండొచ్చని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. ఈ ఏడాది ఆర్‌బిఐ వడ్డీరేట్లను తగ్గించకపోవచ్చని యుబిఎస్ చీఫ్ ఎకనామిస్ట్ జైన్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది రెపో రేటు అర శాతం తగ్గొచ్చన్నారు.

ఎపి ఇఎపిసెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి


ప్రజాశక్తి - హైదరాబాద్



ఎపి ఇఎపిసెట్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీచైతన్య విద్యా సంస్థ తెలిపింది. అగ్రి, ఫార్మాలో స్టేట్ ఒక్కటవ ర్యాంక్‌తో పాటు టాప్ 10లోపు 9 ర్యాంకులను, ఇంజనీరింగ్‌లో స్టేట్ 4వ ర్యాంక్, 7వ ర్యాంక్, 8వ ర్యాంక్‌లతో 10లోపు 3 ర్యాంక్‌లు సాధించినట్లు వెల్లడించింది. దీంతో ఇఎపిసెట్‌లో శ్రీచైతన్యదే ఆధిపత్యం అని మరోసారి నిరూపించుకున్నట్లయ్యిందని పేర్కొంది. అగ్రి, ఫార్మాలో ఎల్లు శ్రీకాంత్ రెడ్డి ఒక్కటో ర్యాంక్, పూల దివ్యతేజ (2వ), వడ్లపూడి ముకేష్ చౌదరి (3వ), పేర సాత్విక్ (4వ), అలూర్ ప్రణీత (5వ), గట్టు బానుతేజ సాయి (6వ), పి నిహారిక రెడ్డి (7వ), శంబంగి మనోఅభిరాం (8వ), శరగడం పావని (9వ) వరుస ర్యాంక్‌లను సాధించారని తెలిపింది.

ఇంజనీరింగ్‌లో పలగిరి సతీష్ రెడ్డి 4వ ర్యాంక్, గొల్ల లేఖహర్ష 7వ ర్యాంక్, పుట్టి కుశాల్ కుమార్ 8వ ర్యాంక్‌ల్లో నిలిచారని పేర్కొంది. అగ్రి, ఫార్మాలో 100 లోపు 50 ర్యాంక్‌లు పొందారని తెలిపింది. ఇంజనీరింగ్‌లో టాప్ 10లోపు 3 ర్యాంక్‌లు, 100 లోపు 55 ర్యాంక్‌లు సాధించారని వెల్లడించింది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మ అభినందనలు తెలిపారు.

హయర్ నుంచి కొత్త గ్రాఫైట్ రేంజ్ రిఫ్రిజిరేటర్లు



న్యూఢిల్లీ : ప్రముఖ గృహోపకరణాల ఉత్పత్తుల సంస్థ హయర్ కొత్తగా గ్రాఫైట్ శ్రేణీ రిఫ్రిజరేటర్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. రెండు, మూడు డోర్ల వేరియంట్లలో వైఫై ఎనేబుల్డ్ స్మార్ట్ రేంజ్‌లో వీటిని డిజైన్ చేసినట్లు తెలిపింది. గ్రాఫైట్ సిరీస్‌పై 10 సంవత్సరాల కంప్రెసర్ వారంటీ, 2 సంవత్సరాల ఉత్పత్తి వారంటీని అందిస్తోన్నట్లు పేర్కొంది. వీటి ప్రారంభ ధరను రూ.24,690గా నిర్ణయించింది.

రామ్కీ ఇన్‌ఫ్రాకు ఫిక్కీ అవార్డు



హైదరాబాద్ : రామ్కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అవార్డు దక్కింది. ఫిక్కీ స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డు 2024లలో "సస్టెయినబుల్ సిటీస్" విభాగంలో ఈ ప్రశంసను పొందినట్లు రామ్కీ ఇన్‌ఫ్రా మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ గుర్తింపు హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌లో ఉన్న లీచేట్ శుద్ధి వినూత్న పరిష్కారాలకు గుర్తింపు అని తెలిపింది. దేశంలోని స్మార్ట్ సిటీల మిషన్ కోసం పని చేస్తున్న 98 ఎంట్రీల నుండి గుర్తింపు పొందిన 10 సంస్థలలో రామ్కీ ఒక్కటిగా నిలిచిందని ఆ సంస్థ ఎండి వైఆర్ నాగరాజ పేర్కొన్నారు.

సిఐఎస్‌ఎఫ్ జవాన్‌పై కేసు రద్దు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు ఉద్యమాన్ని అవహేళనచేసిన కంగనా రనౌత్‌పై చేయి చేసుకున్న సిఐఎస్‌ఎఫ్ జవాన్‌పై సస్పెన్షన్, క్రిమినల్ కేసులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి సోమవారం ప్రకటన విడుదల చేశారు. మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలకుపైగా ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా ఆ ఉద్యమంలో పాల్గొన్న రైతులు ఉద్దేశించి కంగనా రనౌత్ చేసిన అవహేళనను నిరశిస్తూ ఛండీగఢ్ విమానాశ్రయంలో ఈ నెల 4న ఒక రైతుబిడ్డ స్పందనగా సిఐఎస్‌ఎఫ్ జవాన్ కుల్‌వీందర్‌కౌర్ చర్యను చూడాలని వారు కోరారు. క్రిమినల్ కేసు కింద అరెస్టు నుండి ఆమెకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా కంగనా రనౌత్ లాంటి వారు రైతుల ఉద్యమాన్ని అవహేళన చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)


వెంకటేశ్వర్లు (ఫైల్)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో మంగళవారం వెలుగు చూసింది. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... మండలంలోని రచ్చమాలపాడుకు చెందిన ఐతంరాజు వెంకటేశ్వర్లు (49)కు మూడెకరాల సొంత పొలం ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తుండడంతోపాటు గ్రామంలోనే ఎరువులు, పురుగుమందులు వ్యాపారం చేస్తున్నారు దీంతోపాటు రైతులకు మందులను అప్పుగా ఇచ్చి ప్రతిగా పంటలను కొంటుండారు. ఈ క్రమంలో వ్యవసాయంతోపాటు వ్యాపారంలోనూ నష్టాలు రావడంతో సుమారు రూ.40 లక్షల వరకూ అప్పులపాలయ్యారు. అప్పులిచ్చిన వారు వీటిని తీర్చాలని ఒత్తిడి చేస్తుండంతో తీవ్ర మనస్తాపానికి గురై మాచర్ల వెళ్లి పురుగుల మందు కొని తిరిగి ఇంటికి వచ్చే మార్గం మధ్యలో మండాది బ్రహ్మంగారి గుడి వద్ద దానిని తాగి పడిపోయారు. రాత్రయినా వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతుకులాట ప్రారంభించారు. గుడిపక్కన వెంకటేశ్వర్లు మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు చూసి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు మంగళవారం తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తెకు వివాహమైంది. మిగతా వారు చదువుతున్నారు.


శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న టిడిపి నాయకులు

జగనన్న కాలనీ శిలాఫలకం ధ్వంసం

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయకముందే టిడిపి నేతలు ధ్వంస రచన మొదలుపెట్టారు. 'వైసిపి నగుబాటు' పేరుతో బాపట్ల జిల్లా భట్టిప్రోలులోని జగనన్న కాలనీలో వైసిపి పాలనలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో నాయకులు ధ్వంసం చేశారు. వైసిపి ఎన్నికల గుర్తును తగులబెట్టారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ..కాలనీలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా శిలాఫలకాలకు పరిమితమైన నేపథ్యంలో ఆ శిలాఫలకాలను తొలగించి టిడిపి ప్రభుత్వ పాలనలో జరగనున్న అభివృద్ధితో మరో శిలాఫలకాలు రూపుదిద్దుకోనున్నాయని తెలిపారు.



ఓపెన్ ఎఐ 'ఐఫోన్ల'ను నిషేధిస్తాం

- ఎలన్ మస్క్ హెచ్చరిక

శాన్‌ఫ్రాన్సిస్కో : బిలియనీర్ ఎలన్ మస్క్ ఆపిల్ కంపెనీకి ఝలక్ ఇచ్చారు. ఐఫోన్ పోన్ల ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఆపిల్ ఒకవేళ ఓపెన్‌ఎఐ కృత్రిమ మేధాను నిక్షిప్తం చేస్తే ఆ ఉత్పత్తులను నిషేధిస్తామని టెస్లా, స్పేస్‌ఎక్స్, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ఐఫోన్ల ఆపరేటింగ్ సిస్టమ్‌లలోకి చేర్చినట్లయితే ఆ పరికరాలను ఉపయోగించకుండా తన కంపెనీల సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సోమవారం జరిగిన ఆపిల్ వార్షిక వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ తర్వాత ఎలన్ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఫోన్లలో ఓపెన్ ఎఐని చేర్చడం భద్రత ఉల్లంఘనేనని.. ఆమోదయోగ్యం కాదని ఎలన్ మస్క్ పేర్కొన్నారు. ఓపెన్ ఎఐ వినియోగదారుల భద్రత, గోప్యతను ఎలా కాపాడగలదని ఎలన్ మస్క్ ఎక్స్‌లో ప్రశ్నించారు. ఐఫోన్ తయారీదారు ఇటీవల 'ఆపిల్ ఇంటెలిజెన్స్' పేరుతో ఎఐని అభివృద్ధి చేసింది. దీన్ని త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్లు కూడా ఆపిల్ కంపెనీ వెల్లడించింది.

సీజన్ ముగిశాక పరిశీలన..!

- కరువు పరిశీలనకు కేంద్ర బృందం రాక
- వర్షాలు పడి పచ్చదనం ఉన్న సమయంలో పరిశీలనా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'దొంగలు పడ్డ ఆరు మాసాలకు....మొరిగాయి' అన్న చందంగా ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యాక రబీ కరువుపై కరువు బృందం వచ్చేందుకు సిద్ధమైంది. గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో కరువు ఏర్పడింది. అదే కరువు రబీలోనూ కొనసాగింది. తీవ్ర వర్షాభావంతో పంటలు ఏ మాత్రం రైతుల చేతికందలేదు. ఇప్పటికే ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించింది. అనంతపురం జిల్లా వరకు 14 మండలాను కరువు మండలాలుగా ప్రకటించారు. అదే విధంగా సత్యసాయి జిల్లాలో రొద్దం మండలం ఒక్కటే కరువు మండలంగా ప్రకటించారు. రబీ సీజన్ పంట సమయంలో కరువు బృందం పర్యటించలేదు. ఇప్పుడు వర్షాలు పడుతున్న సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యాక బృందం పర్యటించనున్నట్లు ప్రకటన వెలువడింది.

రూ.36.86 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు

అనంతపురం జిల్లాలో రబీలో ఏర్పడిన కరువుకు సంబంధించి పంటనష్టం అంచనాలను అధికారులు రూపొందించారు. దీని ప్రకారం మొత్తం 37,195 హెక్టార్లు పంటనష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఇందులో పప్పుశనగ 34,303 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. దీనికి రూ34.30 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించారు. మినుములు 274 హెక్టార్లకు రూ.27.43 లక్షలు, అలసందలు 3.21 హెక్టార్లకు రూ.32 లక్షలు నష్టం జరిగింది. పెసలు 55.84 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. రూ.5.58 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదించారు. ఉలవలు 64.17 హెక్టార్లు పంటనష్టం జరిగింది. రూ.6.42 లక్షలు, జొన్న 2101.04 హెక్టార్లు రూ.1.78 కోట్లు, కొర్ర 0.47 ఎకరాలు, నాలుగువేలు, నువ్వులు 46.38 హెక్టార్లు, రూ.3.94 లక్షలు, తెల్లకుసుమ 49.39 హెక్టార్లు రూ.4.20 లక్షలు, పొద్దుతిరుగుడు 296.94 హెక్టార్లు, రూ.29.69 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు.

సీజన్ మారాక పంటనష్టం ఎలా..?

ప్రస్తుతం రబీ సీజన్ మారింది. మే ఆఖరు వారం నుంచి వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులుగా పడుతున్న వర్షాలు అంతటా పచ్చదనం కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో రబీ కరువు పంటనష్టం పరిశీలన ఎలా సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వచ్చినా చూసేది ఏముంటుంది. అందే సాయం ఏ మేరకు అన్నది చూడాల్సి ఉంది. మొత్తానికి కేంద్ర కరువు బృందం పరిశీలన ఉంటుందని చెప్పడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి
చంద్రశేఖర్ ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కరువు మొత్తం పూర్తయ్యి సీజన్ మారిన తరువాత పరిశీలన జరిపి ఆదుకునేది ఏమింటుంది. ఇది రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. నష్టం జరిగి సమయంలోనే పరిశీలన చేస్తే రైతుల కష్టాలు తెలుస్తాయి. ప్రభుత్వం ఇప్పటికైనా రబీ నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి రైతులకు పరిహారం అందించే చర్యలు తీసుకోవాలి.


ఐరాస భద్రతా మండలి

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

- అమెరికా ప్రతిపాదిత తీర్మానానికి భద్రతా మండలి ఆమోదం
- ఓటింగ్‌కు దూరంగా ఉన్న రష్యా

న్యూయార్క్ : గాజాలో వెంటనే కాల్పులు విరమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మరోసారి తీర్మానం చేసింది. ఇజ్రాయిల్ దాడులను అంతమొందించేందుకు మూడంచెల కాల్పుల విరమణకు సంబంధించిన సమగ్ర ఒప్పందానికి ఇరుపక్షాలు వచ్చేలా చూసేందుకు ఈ తీర్మానం దోహదపడుతుందని పరిశీలకులు వ్యాఖ్యానించారు. భద్రతా మండలిలోని మొత్తం 15 సభ్య దేశాలకు గాను 14 దేశాలు అనుకూలంగా ఓటు చేశాయి. రష్యా ఓటింగ్‌కు దూరంగా ఉంది. గత నెల్లో బైడెన్ ప్రకటించిన మూడంచెల కాల్పుల విరమణ ప్రణాళికను పూర్తి స్థాయిలో అమల్జేయాలని ఈ తీర్మానం ఇరుపక్షాలను కోరింది. తొలి దశలో భాగంగా తొలుత ఆరు వారాల పాటు కాల్పుల విరమణ పాటించాలని, గాజాలో కొంతమంది బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని ఆ తీర్మానం కోరుతోంది. ఇక రెండో దశలో శాశ్వత కాల్పుల విరమణ, మిగిలిన బందీల విడుదల అమలు జరగాలి. పూర్తిగా ధ్వంసమైన గాజా పునర్నిర్మాణ యత్నాలు మూడో దశలో చేపట్టాలి. ఎలాంటి షరతులు లేకుండా ఈ తీర్మానాన్ని ఇరు పక్షాలు పూర్తిగా అమలు చేయాలని కోరింది. తీర్మానంపై హమాస్ స్పందిస్తూ ఈ విషయంలో మధ్యవర్తులకు సహకరించడానికి తాము సిద్ధంగా వున్నామని చెప్పింది.ఈ మూడంచెల కాల్పుల విరమణ ప్రణాళికను ఇజ్రాయిల్ తీవ్రంగా విమర్శించింది. ఐరాస తీర్మానాలను బేఖాతరు చేస్తూ గాజాపై నెతన్యాహు నరహంతక దాడులు కొనసాగిస్తూనే ఉంది.

తదుపరి ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ : తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. ఈ స్థానంలో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం ద్వివేది బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం రాత్రి రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రసుత్తం ద్వివేది ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. వాస్తవంగా మనోజ్ పాండే మే 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఒక నెల పాటు పదవీ కాలం పొడిగించింది. ద్వివేది 1964 జులై 1న జన్మించారు. 1984లో ఆర్మీలో ప్రవేశించారు. జమ్ముకాశ్మీర్, అస్సాం వంటి ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహించారు.

నీటికుంటలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి (నంద్యాల)

నీటి కుంటలో కాలుజారి పడి అఖిల్ (3) మృతి చెందిన సంఘటన మంగళవారం నంద్యాల జిల్లా చిప్పగిరి మండలంలోని నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల మేరకు... కురువ మహానంది, గాయత్రి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అఖిల్ నాలుగో సంతానం. నీటి కుంట వద్ద ఆడుకుంటూ ఉంటారని తల్లిదండ్రులు అనుకోవడంతో ఈ పొరపాటు జరిగినట్లు తెలిపారు. అఖిల్ మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధు వులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మోటారు సైకిల్, కారు ఢీ

ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- నూజివీడు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మైనం అశోక్ (55), కొండేటి ఆదిశేషు (63) నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో ఫంక్షన్‌కు వచ్చారు. అనంతరం అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై కపిలేశ్వరపురం తిరుగు ప్రయాణమయ్యారు. మీర్జాపురం గ్రామం వద్ద వీరి మోటారు సైకిల్‌ను కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అశోక్, ఆదిశేషు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నూజివీడు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపుగూడెంలో విష జ్వరాల విజృంభణ

- 20 మందికి పైగా జ్వరాలతో ఉన్నట్టు అంచనా

ప్రజాశక్తి- టి.నరసాపురం (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కాపుగూడెంలో విష జ్వరాలు విజృంభించాయి. గ్రామంలో 20 మందికిపైగా జ్వరాలతో బాధపడుతున్నారని, ఇప్పటికే 15 మంది వరకూ జ్వరంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారని గ్రామస్తులు తెలిపారు. ఇంటింటికీ జ్వర పీడితులు ఉన్నారని, వైద్యులు సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రికి వెళ్తే వేల రూపాయలల్లో వెచ్చించాల్సి వస్తోందని, కొందరు వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నామని తెలిపారు. వెంటనే వైద్య బృందం స్పందించి గ్రామంలోని బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్తాచెదారంతో 'ఆత్మకూరు'

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ దిబ్బలను తలపించేలా రోడ్లపైనే చెత్తా చెదారం పేరుకుపోయింది. పట్టణంలోని అర్బన్ కాలనీ, బిసి హాస్టల్ బ్యాక్ సైడ్, నేతాజీ నగర్, అప్పలరావు వీధి తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఆత్మకూరు పట్టణంలో ఒకవైపు ప్రతిరోజూ వర్షం కురుస్తోంది. ఆ వర్షపు నీటితో పలు లోతట్టు ప్రాంతాల కాలనీల్లో రోడ్లు జలమయం అవుతున్నాయి. వర్షపు నీరు నిలువ ఉంటోంది. ప్రతి రోజూ కురుస్తున్న వర్షంతో చెత్తాచెదారం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రస్తుత సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారులు చెబుతున్నప్పటికీ చెత్తా చెదారం తొలగించడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. చెత్త కుప్పలపై దోమలు వృద్ధి చెందుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ప్రజలకు అంటువ్యాధులు తెచ్చే విధంగా చెత్త కుప్పల నుండి దుర్వాసన వెదజల్లుతున్నా ఆత్మకూరులో మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది మాత్రం వీటిని తొలగించడంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఏ వీధిలోకి వెళ్లినా రోడ్లపైనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. సాయంత్రం పూట బయటకు వెళ్లాలంటే పెద్ద ఎత్తున దుర్వాసనతో వస్తుండడంతో ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆత్మకూరు పట్టనంలోని పారిశుధ్యంపై ఇటీవల సిపిఎం కూడా ఆందోళన వ్యక్తపరిచి చెత్తా చెదారాన్ని తొలగించాలని అధికారులను కోరినప్పటికీ స్పందన నామమాత్రంగానే కనిపిస్తోంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆత్మకూరు మున్సిపాలిటీలో మార్పు వస్తుందని అనేక మంది పట్టణ ప్రజలు ఆశించినా నిరాశే ఎదురవుతోంది. చెత్తాచెదారం, వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల అంటువ్యాధులతో పాటు డయేరియా లాంటి వ్యాధులు ఆత్మకూరులో ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాది హత్యకేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్‌కుమార్ హత్య కేసును ధర్మవరం పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. స్థలం వివాదంలో నెలకొన్న ఘర్షణే హత్యకు కారణం అని పోలీసులు నిర్ధారించారు. హత్య, నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాలను మంగళవారం ధర్మవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ సుబ్రమణ్యంతో కలిసి విలేకరులకు వెల్లడించారు. హిందూపురానికి చెందిన సంపత్‌కుమార్ ఎన్‌ఎస్‌ఎయుఐ జాతీయ నాయకునిగా, యువ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సంపత్ కుమార్ స్నేహితుడు శ్రీకాత్‌రెడ్డికి హిందూపురం పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణారెడ్డికి మధ్య ఓ స్థలం వివాదం నడుస్తోంది. ఇందులో స్నేహితునికి మద్దతుగా సంపత్‌కుమార్ నిలిచాడు. తన స్నేహితునికి స్థలం దక్కేలా పలు విధాలుగా పోరాటం చేశారు. ఇందులో భాగంగా కృష్ణారెడ్డిపై పోలీసు స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. ఈ సమస్య పెద్దది కావడంతో సంపత్‌కుమార్‌ను అడ్డుతొలగించాలని కృష్ణారెడ్డి భావించాడు. అందులో భాగంగా ఆయన్ను సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. గత నెల 26న హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లికి చెందిన సెటిలెమెంట్ రామాంజితోపాటు అతని అనుచరులు ధర్మవరం పట్టణం సిద్ధయ్యగుట్టకు చెందిన రంగం రవీంద్ర (ప్రస్తుతం హిందూపురంలో నివసిస్తున్నాడు), హిందూపురానికి చెందిన భుమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసులు నాయుడుతో సంపత్‌కుమార్‌ను హత్య చేసేందుకు న్యాయవాది కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జునరెడ్డిలు రూ.55 లక్షలకు సుఫారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.ఐదు లక్షలను న్యాయవాది కృష్ణారెడ్డి సెటిల్‌మెంట్ రామంజికి ఇచ్చాడు. ఈ క్రమంలో మే 29న రామంజి తన స్నేహితుడితో కదిరి వెళ్లేందుకు కారు తీసుకున్నాడు.

ఆ కారులో హిందూపురానికి వచ్చి సంపత్‌కుమార్‌ను కలిశారు. రామాంజి అతని అనుచరులు శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లు 29వ తేదీ రాత్రి కారులో సంపత్‌కుమార్‌ను ఎక్కించుకుని మద్యం తాగుదామంటూ కర్ణాటక రాష్ట్రం చింతలపల్లికి వెళ్లే రోడ్డు వైపు తీసుకెళ్లారు. అక్కడే రోడ్డు పక్కన ఉన్న కాలువ దగ్గరకు తీసుకెళ్లి ముందస్తు పథకం ప్రకారం బీరు తాగించి ఆ బీరు సీసాలతో సంపత్‌కుమార్‌ను పొడిచారు. అనంతరం వారి వెంట తెచ్చుకున్న బాకులు, కత్తులు, కొడవళ్లతో పొడి హత్య చేశారు. సంపత్‌కుమార్ మరణించారని తెలుసుకున్న తర్వాత అతని మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ధర్మవరం చెరువు రెండో మరువ వద్దకు తీసుకొచ్చి ముళ్ల పొదల్లో పడేశారు. సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ధర్మవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సంగమేశ్వరం వద్దకు కృష్ణా జలాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి (కర్నూలు)

వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సంగమేశ్వరం వద్ద కృష్ణా జలాలు క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద నీరు వస్తుండడంతో సప్తనదుల సంగమ ప్రాంతంలోని సంగమేశ్వరం వద్ద కృష్ణా జలాలు నాలుగు అడుగుల మేర పెరిగాయి. వరద నీటితోపాటు నదీజలాలలో గుర్రపు డెక్కల ఆకు వచ్చి చేరుతుంది. దీంతో సంగమేశ్వరాలయాన్ని సందర్శించేందుకు వచ్చే యాత్రికుల మరబోట్లకు, మత్స్యకారుల బోట్లకు ఆటంకం ఏర్పడుతుంది. శ్రీశైలం డ్యామ్ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా 809.7 అడుగులకు నీరు చేరుకుంది. దీంతో భీమలింగం ప్రాంతం పూర్తిగా కృష్ణాజలాలలో మునిగిపోయింది.

25మందితో మంత్రివర్గం?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడుతో సహా 25మంది బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈమేరకు మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత సమాచారం అందింది. ఆ జాబితా ప్రకారం చంద్రబాబు(ముఖ్యమంత్రి), పవన్ కళ్యాణ్(ఉప ముఖ్యమంత్రి), లోకేశ్, నాదేండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండి ఫరూఖ్, ఆనం రాంనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, గుమ్మడి సంధ్యారాణి, బిసి జనార్ధనరెడ్డి, టిజి భరత్, సవితా, వాసంశెట్టి శుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారు.

'కాళేశ్వరం' విచారణ

- 25లోపు అఫిడవిట్లు సమర్పించాలి
- త్వరలో నిర్మాణ సంస్థలనూ పిలుస్తాం : పిసి ఘోష్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై విచారణకు హాజరైనవారంతా ఈనెల 25లోపు అఫిడవిట్లు సమర్పించాలని కాళేశ్వరం జ్యుడిషియల్ విచారణ కమిషన్ చైర్మన్ పిసి ఘోష్ ఆదేశించారు. తప్పుడు సమాచారంతో అఫిడవిట్లు ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో మీడియాతో మంగళవారం ఆయన చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరం విచారణలో భాగంగా 20 మంది ఇంజినీర్లతో సమావేశమైనట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ సంస్థలనూ విచారణకు పిలుస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికారుల పేర్లు ఉంటే, వారికి కూడా నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. బ్యారేజీలు సరిగ్గా పనిచేస్తే, ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బ్యారేజీలతో లాభమే తప్ప నష్టం లేదని అనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. కమిషన్ చేసే పనులపై బుధవారం జాబితా తయారుచేస్తామని వివరించారు. మూడు బ్యారేజీల బాధ్యతలు చూసిన ఇంజనీర్లను విచారిస్తున్నామనీ, అఫిడవిట్ ద్వారా విషయాలు తెలియజేయాలని వారిని ఆదేశించామని తెలిపారు 'అఫిడవిట్ ద్వారా అన్ని అంశాలు రికార్డు అవుతాయి..బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్లు కనిపిస్తున్నది. లోపం ఎక్కడుంది ? ఎవరి ప్రమేయమైనా ఉందా ? తదితర విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని జస్టిస్ పీసీ ఘోష్ వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదా, ప్యాకేజీ సాధించండి

- మాజీ పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం

విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ, వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని సాధించేందుకు రాష్ట్రంలోని ఎంపీలు కృషి చేయాలని మాజీ పిసిపి అధ్యక్షులు సాకే శైలజానాథ్ కోరారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు కూటమికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారన్నారు. అత్యధిక ఎంపి స్థానాలను కూడా టిడిపి, జనసేన, బిజెపి కైవసం చేసుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ఎంపిలపైన ఆధారపడే కేంద్రంలోని ప్రభుత్వం నడిచే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీని తెచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎంపీలు కృషి చేయాలన్నారు. ఇక రాష్ట్రాభివృద్ధి కోసం కొత్త ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళితో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలో ప్రత్యర్థులపై దాడులు, వైఎస్ఆర్ విగ్రహాల ధ్వంసం లాంటి కార్యక్రమాలు జరుగుతుండడం విచారకరమన్నారు. ఇలాంటి వాటిని నివారించేలా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలియజేశారు.

సికింద్రాబాద్ డివిజన్‌లో రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖ)

దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లోని ఆసిఫాబాద్ రోడ్ - రెచ్ని రోడ్ స్టేషన్లలో మూడో లైన్ కమిషన్, ప్రీ/నాన్ ఇంటర్ లాకింగ్ పనులు, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను విశాఖపట్నం - దువ్వాడ - విజయవాడ -వరంగల్ - బల్లార్షకు బదులుగా విజయనగరం - రాయగడ - టిట్లాగఢ్ -రాయ్‌పూర్ - నాగ్‌పూర్ మీదుగా మళ్లించారు. ఈ క్రమంలో 20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఎపి ఎక్స్‌ప్రెస్, 20806 న్యూఢిల్లీ - విశాఖపట్నం - ఎపి ఎక్స్‌ప్రెస్ జూన్ 22 నుంచి జూలై 5 వరకు, 20803 విశాఖపట్నం - గాంధీధామ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 27, జూలై 5వ తేదీల్లోనూ, 20804 గాంధీధామ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లోనూ, 12803 విశాఖపట్నం - హెచ్.నిజాముద్దీన్ స్వర్ణ జయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 24, 28, జూలై 1, 5 తేదీల్లోనూ, 12804 హెచ్.నిజాముద్దీన్ - విశాఖపట్నం స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 26, 30, జూలై 3 తేదీల్లోనూ, 20819 పూరీ - ఓఖా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లోనూ, 20820 ఓఖా - పూరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 26, 30 తేదీల్లోనూ మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే సీనియర్ డిసిఎం కె.సందీప్ తెలిపారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

కలినరీ ఆర్ట్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ (తిరుపతి) ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కలినరీ ఆర్ట్స్‌లో బిబిఎ, 2 సంవత్సరాల ఎంబిఎ, 3 సంవత్సరాల బిఎస్‌సి హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.తిరులోగచందర్ తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తిరుపతి, నొయిడాలో ఉన్న విద్యా సంస్థల్లో కలినరీ ఎడ్యుకేషన్ రంగంలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇనిస్టిట్యూట్లు ఒకటన్నారు. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్-తిరుపతి తన కార్యకలాపాలను 2016 ఆగస్టులో 25 మంది విద్యార్థులతో ప్రారంభించిందని, తక్కువ వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ హాస్పిటాలిటీ ఇనిస్టిట్యూట్‌గా పేరుగాంచిందని తెలిపారు. 2018-19లో మంత్రిత్వ శాఖ నుంచి అవార్డు అందుకున్నామన్నారు. ఇనిస్టిట్యూట్‌లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలైన వంటశాస్త్ర స్టూడియో, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ప్రత్యేకమైన కిచెన్లు, ఆధునిక పరికరాలతో కూడిన మైక్రోబయాలజీ లేబొరేటరీ, వివిధ వంటకాల కోసం శిక్షణా రెస్టారెంట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులకు, అందునా బాలికలకు ఆధునిక హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. నిపుణులతో కూడిన బోధనా బృందం తమ సొంతమన్నారు. అడ్మిషన్ రిజిస్ట్రేషన్లు, ఫీజు మొదలైన వాటికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం, https://www.icitirupati.in చూడాలని కోరారు. 8108103478, 9985486271, 8106212224. నెంబర్ల ద్వారా పలు విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. సమావేశంలో నొవాటెల్ చీఫ్ మాస్టర్ చెఫ్ మదీనా వల్లి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

- నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి- టి.నరసాపురం (ఏలూరు జిల్లా)

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట ఎస్‌సి కాలనీ మహిళలు, గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం - చింతలపూడి రోడ్డును నిర్బంధించారు. దీంతో, ఆ మార్గంలో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని నినాదాలు చేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ ఇళ్లకు బురద నీరు సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బురద నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఇక్కడికి చేరుకొని వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు నుంచి బురద నీరు ఇళ్లకు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు సమీప రైతు పొలంలోని బోరు నీటిని ఇళ్లకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఢిల్లీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- యుపి పవర్ స్టేషన్‌లో ప్రమాద ప్రభావం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని మండోలలో ఒక విద్యుత్ సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని ఢిల్లీ విద్యుత్ శాఖ మంత్రి అతిషి తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు, ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారని, త్వరలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు. 'ఢిల్లీలో అనేక ప్రాంతాల్లో మధ్యాహ్నం 2:11 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని మండోలలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పిజిసిఐఎల్) సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం కారణంగా ఈ అంతరాయం కలిగింది. ఈ సబ్ స్టేషన్ నుంచి ఢిల్లీకి 1200 మెగావాట్ల విద్యుత్ సరఫరా జరుగుతుంది. అందువల్లనే ఢిల్లీలోని అనేక ప్రాంతాలపై ప్రభావం పడింది' అని ఆమె తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగినట్లు మంత్రి తెలిపారు.

ఉమ్మడి పౌర స్మృతి ప్రభుత్వ ఎజెండాలో భాగమే

- కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతి ప్రభుత్వ ఎజెండాలో భాగమని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చెప్పారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జాతీయ లిటిగేషన్ విధానపత్రంపై తొలి సంతకం చేశారు. మోడీ ప్రభుత్వ వంద రోజుల ఎజెండాలో భాగంగా ఈ విధాన పత్రాన్ని ఆమోదం కోసం కేబినెట్ ముందు పెట్టనున్నారు. న్యాయమూర్తుల నియామకాలకు అనుసరించాల్సిన పద్ధతులపై త్వరలో పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ నెలకొందన్న వ్యాఖ్యలను ఆయన తిరస్కరించారు. ఒక దేశం, ఒక ఎన్నిక అంశంపై మాట్లాడుతూ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికను సమర్పించిందని, లా కమిషన్ దీనిపై కసరత్తు చేస్తోందని తెలిపారు. న్యాయస్థానాల ముందు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న అంశాలపై సత్వర న్యాయం అందజేయాలన్నది తన మంత్రిత్వ శాఖ ప్రాధాన్యత అని చెప్పారు.

మంత్రి పదవికి రాజీనామా చేసిన జార్ఖండ్ నేత ఆలంగీర్ ఆలం

రాంచీ : మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన జార్ఖండ్ నేత ఆలంగీర్ ఆలం మంగళవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పక్షనేత పదవికి కూడా రాజీనామా చేశారు. అలంగీర్ ఆలం రాజీనామా చేసినట్లు జార్ఖండ్ కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ ఠాకూర్ నిర్ధారించారు. ఆలంగీర్ గ్రామీణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాలు, గ్రామీణ పనులు, పంచాయితీ రాజ్ వంటి నాలుగు శాఖలను నిర్వహించేవారు. మనీలాండరింగ్ కేసులో గత నెల 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆలంగీర్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మే 6 అలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్ పని మనిషి జహంగీర్ ఆలం ఇంట్లో ఇడి సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో సుమారు రూ. 37 కోట్ల భారీ నగదు పట్టుబడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలంగీర్ ఆలంతోపాటు సంజీవ్ లాల్‌ను కూడా ఇడి అదుపులోకి తీసుకుంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 4.3గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మంగళవారం తెల్లవారుజామున 2.35 నిమిషాలకు భూకంపం సంభవించింది. వెడల్పు : 36.43, పొడవు : 70.98, 160 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించింది.

ఘాటెక్కుతున్న ఉల్లి



- నిన్నటి దాకా రూ.వందకు ఐదు కిలోలు.. ఇప్పుడు రెండు కిలోలే..
- పక్షం రోజుల్లో 30-50 శాతం పెరుగుదల
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

న్యూఢిల్లీ : ఉల్లి మరోసారి ఘాటెక్కింది. గత పక్షం రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉల్లి ధరలు 30 నుండి 50% వరకూ పెరిగాయి. సరఫరాలు తగ్గిపోవడమే దీనికి కారణంగా భావిస్తున్నారు. మరోవైపు బక్రీద్ పండుగ సమీపిస్తుండడంతో ఉల్లికి డిమాండ్ పెరిగింది. డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం కారణంగా ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్న ఉద్దేశంతో కొందరు వ్యాపారులు ఉల్లిని నిల్వ చేసి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.

నాసిక్‌లోని లాసాల్‌గాన్ మండిలో గత నెల 25న కిలో ఉల్లిగడ్డ ధర రూ.17 పలకగా సోమవారం అది రూ.26కు చేరింది. నాణ్యమైన ఉల్లి కావాలంటే రూ.30 చెల్లించాల్సి వస్తోంది. ఉల్లిగడ్డలు జూన్ నెల నుండి మార్కెట్‌కు వస్తుంటాయి. అప్పటి వరకూ రైతులు, వ్యాపారులు వాటిని తమ వద్దే నిల్వ చేస్తారు. తమ వద్ద ఉన్న నిల్వలను విక్రయించేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. రబీ సీజన్‌లో ఉల్లి దిగుబడులు తగ్గిన నేపథ్యంలో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని వారు ఆశిస్తున్నారు.

ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు సడలించడంతో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా తదితర దేశాలకు ఉల్లి ఎగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. గత నెలలో ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేసిన తర్వాత నాసిక్ జిల్లా నుండి ప్రతి రోజూ సగటున మూడు వేల టన్నుల ఉల్లిగడ్డలతో కంటైనర్లు తరలిపోతున్నాయని ఓ వ్యాపారి తెలిపారు. దీనివల్ల దేశంలో ఉల్లికి డిమాండ్ పెరిగిందని ఆయన చెప్పారు.

ఈ నెల 17న ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకుంటున్న నేపథ్యంలో దేశీయంగా డిమాండ్ పెరగవచ్చునని వ్యాపారులు అంచనా వేశారు. ముఖ్యంగా మహారాష్ట్రలో పండే ఉల్లికి దక్షిణాది రాష్ట్రాల నుండి తీవ్రమైన డిమాండ్ ఉంటోంది. కేంద్రం ఎగుమతి సుంకాన్ని తొలగిస్తుందని రైతులు, వ్యాపారులు భావిస్తున్నారు. దేశీయంగా ధరలు పెరగడానికి ఇది ఓ కారణం. ధరలు పెరిగే వరకూ వారు తమ వద్ద ఉన్న నిల్వలను మార్కెట్‌కు పంపబోరని, అందుకే కృత్రిమ కొరత ఏర్పడి ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయని చెబుతున్నారు.

అదో కుటుంబ మంత్రివర్గం

- ప్రియాంక పోటీ చేసుంటే మోడీ ఓడిపోయేవారు : రాహుల్‌గాంధీ


రాయ్‌బరేలి సభలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ. ప్రియాంకా గాంధీ

రాయ్‌బరేలి : ప్రధాని మోడీ క్యాబినెట్ కుటుంబ మంత్రివర్గమని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. తరతరాలుగా సాగుతున్న పోరాటం, సేవ, త్యాగాలను బంధుప్రీతిగా విమర్శించేవారు (మోడీ) తమ మంత్రివర్గంలో వారసత్వాలకు పెద్ద పీట వేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. 'మాటలకు చేతలకు మధ్య వ్యత్యాసం ఉంటే ఆ వ్యక్తిని నరేంద్ర మోడీ అని అంటారు' అని పేర్కొన్నారు. మోడీ తన నూతన మంత్రివర్గంలో మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడు కుమారస్వామికి, కేంద్ర మాజీ మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య సింధియాకు, అరుణాచల్ ప్రదేశ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజుకు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఏకనాథ్ ఖడ్సే కోడలు రక్ష ఖడ్సేకు, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనవడు జయంత్ చౌదరికి స్థానం కల్పించడాన్ని రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు కుమారుడు రామ్‌మోహన్ నాయుడికి, కేంద్ర మాజీ మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్‌కి, హర్యానా మాజీ మంత్రి రావు బీరేంద్ర సింగ్ కుమారుడు ఇంద్రజిత్ సింగ్‌కు మంత్రులుగా అవకాశం ఇవ్వడాన్ని రాహుల్ గుర్తు చేశారు.

2 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయేవారు

తాజా లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే ప్రధానమంత్రి మోడీ అక్కడ కనీసం రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయేవారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. రాయ్‌బరేలిలో నిర్వహించిన కృతజ్ఞతా సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ బలాన్ని తగ్గించడానికి రాయ్‌బరేలీ, అమేథీతోపాటు దేశంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పోరాటం చేశాయని అన్నారు. ఎన్నికల ఫలితాలపై అహంకారానికి లోనుకాకుండా, ప్రజల ప్రయోజనాల కోసం ఇండియా వేదిక ఎంపీలు పనిచేస్తామని రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా తెలిపారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవంలో సామాన్య ప్రజలను విస్మరించిన మోడీ పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులకు ప్రాధాన్యత ఇచ్చారని, అయోధ్యలో ఓటమితో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ మాట్లాడుతూ రాయ్‌బరేలిలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిపక్షాల మాట వినడం మోడీ డిఎన్‌ఎలోనే లేదు : కపిల్ సిబాల్

- భగవత్ మాటనైనా వినండి

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల మాట వినడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డిఎన్‌ఎలోనే లేదని కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ విమర్శించారు. కనీసం ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాటలనైనా వినాలని సూచించారు. ఏడాదికి పైగా మణిపూర్‌లో హింసాకాండ కొనసాగడంపై భగవత్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కపిల్ సిబాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో బిజెపి ప్రభుత్వంలో జరిగింది ఈ కొత్త ప్రభుత్వంలో పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. 'మేం మణిపూర్ ముఖ్యమంత్రిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. మీరు కనీసం రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను కూడా తొలగించలేకపోయారు. ఇక ముఖ్యమంత్రి గురించి ఏమి చేస్తారు' అని కపిల్ సిబాల్ అన్నారు. ప్రతిపక్షాల స్వరాన్ని కూడా వినాలని, అప్పుడే దేశం ముందుకు వెళుతుందని చెప్పారు. జమ్ముకాశ్మీర్‌లో బస్సుపై ఉగ్రదాడి విషయంలోనూ మోడీ ప్రభుత్వంపై కపిల్ సిబాల్ విమర్శలు చేశారు. మోడీ ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేసిందని, దాని ఫలితం ఇప్పుడు అందరూ అనుభవిస్తున్నారని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి ఐదేళ్లు గడిచిపోయినా జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితి అలాగే ఉందని అన్నారు. వీలైనంత త్వరగా ఎన్నికలు జరుగుతాయని చెప్పారని, కానీ ఇంకా జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగలేదని గుర్తు చేశారు. మూడుసార్లు ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసినంత మాత్రాన.... మోడీకి, జవహర్‌లాల్ నెహ్రూకు మధ్య ఎలాంటి పోలికలు లేవని అన్నారు. నెహ్రూజీ ఆలోచనా విధానం మోడీకి ఎన్నటికీ రాదని అన్నారు. మోడీ రెండుసార్లు బిజెపి ప్రధానమంత్రిగానూ, మూడోసారి ఎన్‌డిఎ ప్రధానిగానూ ప్రమాణస్వీకారం చేశారన్నారు.

బిజెపిలో సంస్థాగత మార్పులు ?

- కేంద్ర మంత్రి అయిన పార్టీ అధ్యక్షుడు నడ్డా
- పదవీకాలం ముగిసిన ప్రధాన కార్యదర్శి సంతోష్
- ఈ రెండు పదవుల భర్తీకి ప్రయత్నాలు
- ఓడిన మంత్రులకూ పార్టీ పనులు





న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బిజెపికి నిరుత్సాహాన్ని కలిగించాయి. ఆ పార్టీ 63 స్థానాలను కోల్పోయింది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీలో భారీ మార్పులు చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జెపి నడ్డాను కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకోవడంతో ఆ పదవిని భర్తీ చేయాల్సి ఉంటుంది. పార్టీ వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన మరో పదవి ప్రధాన కార్యదర్శి. పార్టీలో అధ్యక్షుడి తర్వాత రెండో స్థానం ప్రధాన కార్యదర్శిదే. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న బిఎల్ సంతోష్ తన రెండు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. దీంతో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిని కూడా ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది.

గతంలో బిజెపి అధ్యక్షులుగా వ్యవహరించిన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేరారు. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత వారిద్దరూ పార్టీ పదవుల నుండి వచ్చి ప్రభుత్వంలో సీనియర్ మంత్రులుగా ఎదిగారు. 2019లో నడ్డా బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 2020లో అమిత్ షా స్థానంలో పార్టీ అధ్యక్షుడయ్యారు. అప్పుడు అమిత్‌షా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నడ్డా మూడేళ్ల పదవీకాలం గత సంవత్సరం జనవరితోనే ముగిసినప్పటికీ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దానిని పొడిగించారు. కేంద్ర మంత్రిగా నియమితులైనప్పటికీ నడ్డా ఇప్పటి వరకూ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయలేదు. మోడీ ఆర్‌ఎస్‌ఎస్ సీనియన్ నేతలతో చర్చించి నడ్డా స్థానంలో వేరొకరిని అధ్యక్షుడిగా నియమిస్తారా? లేక ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంటును నియమించి, ఆ తర్వాత ఆయనను అధ్యక్షుడిని చేస్తారా అనేది చూడాల్సి ఉంది.

బిజెపి అధ్యక్ష పదవికి మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ పేర్లు వినిపించాయి. వారిని కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడిన భూపేంద్ర యాదవ్, పీయుష్ గోయల్ కూడా మంత్రులయ్యారు. తాజాగా మహారాష్ట్రకు చెందిన వినోద్ తాడే పేరు విన్పిస్తోంది. బిజెపికి దళితులు, ఓబీసీలు దూరమైన నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తికి పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించే యోచన కూడా చేస్తున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికలు నూతన అధ్యక్షుడికి పరీక్షగా నిలవబోతున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన 16 మంది కేంద్ర మంత్రులకు కూడా బిజెపి ఏదో ఒక బాధ్యత అప్పగించాల్సి ఉంటుంది. వారిలో కొందరికి పార్టీ పదవులు కట్టబెట్టవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించినా మంత్రి పదవి కోల్పోయిన అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు సైతం పార్టీ పదవి లభించే అవకాశం ఉంది.

ఉప సభాపతి పదవికి పోటీ

- ప్రతిపక్షాల నిర్ణయం
- ఈసారైనా ఆ పోస్టును భర్తీ చేస్తారా?

న్యూఢిల్లీ : లోక్‌సభ ఉప సభాపతి పదవికి పోటీ చేయాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. గత లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశాల్లో సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉంటాయి. ఈ సభకైనా డిప్యూటీ స్పీకర్ ఉంటారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. నూతన లోక్‌సభలో ఇండియా బ్లాక్‌కు 234 మంది సభ్యులు ఉన్నారు. అధికార పక్షానికి సభాపతి పదవి, ప్రతిపక్షానికి ఉప సభాపతి పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇవ్వాలా వద్దా అనేది పాలక పక్షం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

17వ లోక్‌సభ సమావేశాలు అసాధారణ రీతిలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిశాయి. స్పీకర్ ఎన్నిక ముగిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలని రాజ్యాంగం చెబుతోందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచారి తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన పదవి అని, పార్లమెంటరీ వ్యవస్థలో ఉప సభాపతికి రాజ్యాంగం ముఖ్యమైన స్థానాన్ని కల్పించిందని ఆయన చెప్పారు. ఆ పదవికి ఎవరినీ నియమించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

'సాధ్యమైనంత త్వరగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను లోక్‌సభ విధిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది' అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 నిర్దేశిస్తోంది. 'డిప్యూటీ స్పీకర్ పోస్టు రాజ్యాంగ పదవి. అది ప్రతిపక్షానికి చెందుతుంది. తమకు ఆ పదవిని ఇవ్వాలని నూతన లోక్‌సభలో ప్రతిపక్షాలు కోరవచ్చు. అది సభ్యులు ఎన్నుకునే పోస్టు. ముందుగా స్పీకర్‌ను ఎన్నుకోవాలి. వారం రోజుల వ్యవధిలో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలి. ఇది పద్ధతి' అని ఆచారి తెలిపారు. కాగా గతంలో తాము ఉప సభాపతి స్థానాన్ని నిర్వహించామని, ఇప్పుడు కూడా ఆ పదవికి పోటీ చేస్తామని ప్రతిపక్ష నేత ఒకరు చెప్పారు. '2004-2014 మధ్యకాలంలో యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష ఎన్డీఏకు ఇచ్చాము. గతంలో అనేక ప్రభుత్వాలు డిప్యూటీ స్పీకర్ పదవిని ఏకాభిప్రాయంతో ప్రతిపక్షాలకే ఇచ్చాయి' అని ఆయన గుర్తు చేశారు.

1956లో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపక్ష అకాలీదళ్ ఎంపీ సర్దార్ హుకమ్ సింగ్‌ను డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించారు. ఆ తర్వాత వచ్చిన అనేక ప్రభుత్వాలు ఈ సంప్రదాయాన్నే అనుసరించాయి. స్పీకర్ లేనప్పుడు ఆ స్థానంలో డిప్యూటీ స్పీకర్ కూర్చుని సభను నడిపిస్తారు. ఆ సమయంలో స్పీకర్‌కు ఎన్ని అధికారాలు ఉంటాయో డిప్యూటీ స్పీకర్‌కు కూడా అవే అధికారాలు ఉంటాయని నిబంధనలు చెబుతున్నాయి.

కేబినెట్‌లో 70 శాతం శత కోటీశ్వరులే!

- పెమ్మసానే అత్యంత ధనికుడు
- 39 శాతం మందిపై క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ప్రధాని మోడీ కొత్త మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే ఉన్నారు. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు తమ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల వాచ్ డాగ్ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించింది. కొత్త మంత్రివర్గంలో బిజెపి నుండి 61 మంది, ఎన్‌డిఎ మిత్రపక్షాల నుండి 11 మంది ఉన్నారు. 72 మంది మంత్రుల్లో 43 మంది మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఎంపిలుగా ఎన్నికయ్యారు. 39 మంది గతంలో కేంద్ర మంత్రులుగా పనిచేశారు.

అత్యంత సంపన్నుడు పెమ్మసాని

మోడీ మంత్రివర్గంలో అత్యంత ధనిక మంత్రిగా, టిడిపి నుంచి లోక్‌సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయనను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖకు సహాయ మంత్రిగా నియమించారు. ఆ తరువాత స్థానంలో జ్యోతిరాదిత్య సింధియా ఉన్నారు. ఆయన కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా ఉన్నారు. మూడో స్థానంలో ఉన్న హెచ్‌డి కుమారస్వామి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అశ్విని వైష్ణవ్ రైల్వే, ఐ అండ్ బి, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నారు. ఐదో స్థానంలో ఉన్న పియుష్ గోయల్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ మంత్రుల ఆస్తులను ఎడిఆర్ లెక్కించింది. 71 మంది కేంద్ర మంత్రుల్లో 47 (66 శాతం) మంది కొత్తవారు కాగా, వారి వయస్సు 51-71 మధ్య ఉంది. 11 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించగా, 57 మంది గ్రాడ్యుయేట్, ఆపైన చదివారు.

28 మందిపై క్రిమినల్ కేసులు

కేంద్ర మంత్రివర్గంలో 28 (39 శాతం) మంది మంత్రులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ వెల్లడించింది. వారు హత్యాయత్నాలు, కిడ్నాప్, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తమ అఫిడవిట్‌లలో పేర్కొన్నారు. వీరిలో 19 మంది మంత్రులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఎడిఆర్ విశ్లేషించింది. తమపై హత్యాయత్నం కేసులు ఉన్నట్లు ప్రకటించిన మంత్రుల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంతను ఠాకూర్, సుకాంత మజుందార్ ఉన్నారు.

మహారాష్ట్రలో 'ఇండియా' విచ్ఛిన్నానికి బిజెపి కుట్ర!


- ఉద్ధవ్ థాకరేకు ప్రశంసలు



ముంబయి : తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎన్‌డిఎ కూటమి ఘోర పరాభావాన్ని చవిచూసింది. ఎన్‌డిఎలోని శివసేన (ఏక్‌నాథ్ షిండే గ్రూపు), ఎన్‌సిపి (అజిత్ పవార్ గ్రూపు) పార్టీలు ఎంతమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. అసలైన శివసేన, ఎన్‌సిపిలను చీల్చి బిజెపి ఈ గ్రూపులను తనవైపునకు తిప్పుకున్న సంగతి తెలిసిందే. ఇండియా వేదికలోని శివసేన (ఉద్ధవ్ థాకరే గ్రూపు), ఎన్‌సిపి (శరద్ పవార్ గ్రూపు)లకు ప్రజల ఆదరణ లభించడంతో బిజెపిలో ఆందోళన పెరుగుతోంది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదికలోని కాంగ్రెస్‌కు 13 స్థానాలు లభించగా, శివసేన (ఉద్ధవ్ థాకరే గ్రూపు) 9, ఎన్‌సిపి (శరద్ పవార్ గ్రూపు) 8 స్థానాల్లోనూ విజయం సాధించాయి.

ఈ ఏడాదిలోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోగానే ఇండియా వేదిక పార్టీలను చీల్చాలని బిజెపి భావిస్తోంది. అందుకోసం ఉద్ధవ్ థాకరేపై ప్రశంసలు కురిపిస్తూ, తమవైపునకు తిప్పుకోవాలని అనుకుంటోంది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఉద్ధవ్ కష్టపడి పనిచేయడం వల్లే ఇండియా వేదిక లాభపడిందని బిజెపి నాయకుడు చంద్రకాంత్ పాటిల్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఉద్ధవ్ థాకరే కష్టంతో కాంగ్రెస్, ఎన్‌సిపిలు లాభపడ్డాయని చెప్పారు. ఈ ప్రశంసలను ఉద్ధవ్ థాకరే పట్టించుకోరని శివసేన కార్యకర్తలు అంటున్నారు. ఏక్‌నాథ్ షిండే ద్వారా శివసేనను బిజెపి చీల్చడంతో ఉద్ధవ్ థాకరే తన ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

ఎంపీగానే కొనసాగుతా : అఖిలేష్ యాదవ్



లక్నో : సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఎమ్మెల్యే పదవిని వదులుకుని, ఎంపీగానే కొనసాగుతానని ప్రకటించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ కన్నౌజ్ నుంచి ఎంపీగా బరిలోకి దిగి భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. 'నేను కర్హాల్, మెయిన్‌పురి కార్యకర్తలను కలిశాను. రెండు ఎన్నికల్లోనూ రెండు స్థానాల నుంచి గెలిచాను. ఒక సీటును వదులుకోవాలి. అందుకే కర్హాల్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేస్తున్నాను.' అని ఆయన అన్నారు.

లోక్‌సభలో ఎస్‌పి నేతగా అఖిలేష్ యాదవ్ వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయనున్నారని ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా బ్లాక్ మొత్తం 80 స్థానాల్లో 43 స్థానాలను గెలుచుకుంది. సమాజ్‌వాది పార్టీ 37 సీట్లలో విజయం సాధించి లోక్‌సభలో బిజెపి, కాంగ్రెస్ తర్వాత మూడవ అతిపెద్ద పార్టీగా నిలిచింది.

మిత్రులకు మొండిచేయి

- కీలక పదవులన్నీ బిజెపికే
- 11 మంత్రి పదవులతో సరి
- అందులోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ మంత్రిమండలిలో బిజెపి భాగస్వామ్య పక్షాలకు సముచిత ప్రాతినిధ్యం లభించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనేక మిత్రపక్షాల డిమాండ్లను మోడీ ఖాతరు చేయలేదు. మోడీ క్యాబినెట్‌లోని 72 మంది సభ్యుల్లో బిజెపి భాగస్వామ్య పక్షాలకు చెందిన 11 మందికే చోటుదక్కింది. వారిలోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా లభించింది.

క్యాబినెట్ పదవులు వీరికే

దక్షిణది నుండి జెడిఎస్ నేత హెచ్‌డి కుమారస్వామికి భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ లభించింది. తెలుగుదేశం పార్టీకి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడికి పౌర విమానయాన శాఖను కేటాయించారు. బీహార్ నుండి హిందుస్థానీ ఆవామ్ మోర్చ సెక్యులర్ పార్టీకి చెందిన జితన్ రామ్ మాంఝీకి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖను అప్పగించారు. అదే రాష్ట్రానికి చెందిన జెడియు ఎంపీ రాజీవ్ రంజన్‌సింగ్‌కు పంచాయతీరాజ్‌తోపాటు మత్స్య. పశు సంవర్ధక, డెయిరీ శాఖను ఇచ్చారు. లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖను కేటాయించాయి. మిత్రపక్షాలకు చెందిన ఈ ఐదుగురికి మాత్రమే క్యాబినెట్ హోదా దక్కింది.

సహాయ మంత్రులు వీరే

శివసేనకు చెందిన జాదవ్ ప్రతాప్‌రావు గణపతిరావ్, ఆర్‌ఎల్‌డీకి చెందిన జయంత్ చౌదరికి స్వతంత్ర హోదాతో మంత్రి పదవులు లభించాయి. ఇక రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలే) నేత రాందాస్ అథావలేకు ఒక మంత్రిత్వ శాఖలో, అప్నాదళ్‌కు చెందిన అనుప్రియా పటేల్‌కు రెండు మంత్రిత్వ శాఖల్లో సహాయ మంత్రి పదవులు ఇచ్చారు. ఆయా పార్టీలకు సభలో వీరిద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, తెలుగుదేశం పార్టీకి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్‌లకు కూడా సహాయ మంత్రి పదవులు లభించాయి.

డిమాండ్లు నెరవేరలేదు

పదహారు మంది సభ్యులున్న తెలుగుదేశం పార్టీ స్పీకర్ పదవితో పాటు నాలుగు కీలక మంత్రిత్వ శాఖల కోసం పట్టుబట్టి, చివరికి రెండు పదవులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని తెలిసింది. జనసేనకు క్యాబినెట్‌లో స్థానం దక్కలేదు. మరోవైపు 12 మంది ఎంపీలున్న జెడియు రైల్వేలు సహా మూడు మంత్రిత్వ శాఖలను కోరింది. ఒకప్పుడు తన తండ్రి రాం విలాస్ పాశ్వాన్ నిర్వహించిన రైల్వే శాఖను తనకు కేటాయించాలని చిరాగ్ కూడా అడిగారు. నరేంద్ర మోడీ మాత్రం కీలక శాఖలన్నింటినీ బిజెపి సభ్యులకే కట్టబెట్టారు.

మిత్రపక్షాలకు పరిమాణంలోనే (క్వాంటిటీ)లోనే కాదు...నాణ్యత (క్వాలిటీ)లోనూ మొండిచేయే చూపారని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వ్యంగ్యోక్తి విసిరారు. 'హోం లేదు. రక్షణ లేదు. ఆర్థికం లేదు. విదేశాంగ శాఖా లేదు. వాణిజ్యం లేదు. రైల్వే లేదు. విద్య లేదు. ఆరోగ్యమూ లేదు. వ్యవసాయం లేదు. జల శక్తీ లేదు. పెట్రోలియం లేదు. టెలికమ్యూనికేషన్లూ లేవు' అని సెటైర్ వేశారు. బిజెపి మిత్రపక్షాలకు ఇది అవమానకరమని ఆయన చెప్పారు. మంత్రి పదవిని ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారని, తనకు ఇవ్వజూపిన పదవి తన స్థాయిని తగ్గిస్తుందని ఆయన భావించారని కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ తెలిపారు.

ఇయు ఎన్నికల్లో ఓటమితో

జర్మనీ ఛాన్సలర్‌పై పెరుగుతున్న ఒత్తిడి !




బెర్లిన్ : ఆదివారం జరిగిన యురోపియన్ యూనియన్ ఎన్నికల్లో ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వంలోని మూడు పార్టీలు ఘోరంగా ఓడిపోవడంతో జర్మన్ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్‌పై రాజకీయంగా ఒత్తిడి పెరుగుతోంది. ఇతర యూరోపియన్ దేశాల్లో మాదిరిగానే ఇక్కడ కూడా మితవాద పార్టీల దూకుడు పెరిగింది.. షుల్జ్‌కి చెందిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌డిపి)13.9శాతం ఓట్లు, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న గ్రీన్స్ పార్టీకి 11.9శాతం ఓట్లు వచ్చాయి గత సారి ఎన్నికల్లో వచ్చిన 20.5శాతం ఓట్లతో పోలిస్తే ఎస్‌డిపి గణనీయంగా ఓట్లు కోల్పోయింది. మరో వైపు కన్జర్వేటివ్ పార్టీలైన క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు), క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సిఎస్‌యు)లకు 30శాతం ఓట్లు వచ్చాయి. దీంతో ఈ యూనియన్ జర్మనీలో బలమైన పార్టీగా ముందుకొచ్చింది. దేశ ప్రయోజనాల రీత్యా తక్షణమే కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం వుందని సిడియు నేత ఫ్రెడరిక్ మెర్జ్ ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే ఏడాది పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంకీర్ణానికి ఇది చిట్టచివరి హెచ్చరిక అని వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయిందని సిఎస్‌యు నేత మార్కస్ సోడెర్ విమర్శించారు. షుల్జ్ అధికారాన్ని అంటిపెట్టుకుని కూర్చోకుండా ఫ్రాన్స్ నేత మాక్రాన్‌లా జాతీయ పార్లమెంటును రద్దు చేసి తిరిగి ఎన్నికలు జరిపించాలని ఆయన కోరారు.

హత్యకేసులో కన్నడ నటుడి అరెస్టు

బెంగళూరు: ఒక హత్యకేసులో ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మైసూరులో ఆయనతో పాటు మరో పదిమందిని బెంగళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం బెంగళూరుకు తరలించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న రేణుకాస్వామి హత్యకు గురయ్యారు. ఈ కేసులో దర్శన్‌పై ఆరోపణలు వచ్చాయి. విచారణలో భాగంగా నిందితుడు నటుడు దర్శన్ పేరు వెల్లడించారని చెప్పారు. అతడితో నటుడు నిరంతరం టచ్‌లో ఉండేవాడని తెలుస్తోంది. దాంతో దర్యాప్తు నిమిత్తం ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. మృతుడు ఒక సినీనటికి అసభ్యకరమైన సందేశాలు పంపినట్లు తెలిసింది. ఆ నటిని కూడా ప్రస్తుతం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆర్‌ఆర్ నగర్‌లోని దర్శన్ ఇంటి వద్ద పోలీసులు భద్రతను పెంచారు. 2002లో మాజెస్టిక్ చిత్రంతో కథానాయకుడిగా తన ప్రయాణం మొదలుపెట్టిన ఆయన.. తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్నారు. గతంలో పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు.

చప్పగా టి20 ప్రపంచకప్

- అభిమానుల్లో జోష్ నిల్..
- నాసిరకం పిచ్‌లే కారణమా?
- రాబోయే మ్యాచుల్లోనైనా స్కోర్‌బోర్డు పరుగెత్తేనా..



టి20 ఫార్మాట్ అంటేనే ఫోర్లు.. సిక్సర్లు.. అభిమానుల కేరింతలు.. టీవీలకు అతుక్కుపోయిన జనాలు.. గెలుపు ఓటములపై ఉత్కంఠ.. వీటన్నింటి కలయిక. ఇక ప్రపంచకప్‌లో ఈ హోరు మరోవిధంగా ఉంటుంది. కానీ ఈసారి టి20 ప్రపంచకప్ ఆ స్థాయిలో జరగడం లేదు. ఈ మెగా టోర్నీలో బ్యాటర్లపై బౌలర్ల ఆధిపత్యం పెరిగింది. ఇందుకు ప్రధాన కారణంగా న్యూయార్క్‌లోని నాసిరకం పిచ్‌లే కారణం అంటూ మాజీ క్రికెటర్లు వాపోతున్నారు. భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య న్యూయార్క్‌లోని నసావ్ కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ చేసింది 119పరుగులు. 19 ఓవర్లకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు 113పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు ఆలౌట్ అయ్యింది అంటే అదీ లేదు. నిర్ణీత 20 ఓవర్లు ఆడినా విజయాన్ని సొంతం చేసుకోలేదు. ఆ తర్వాత రోజు సోమవారం దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన ఇదే పిచ్‌పై మరో మ్యాచ్ జరిగింది. దక్షిణాఫ్రికా 113పరుగులే చేస్తే.. బంగ్లాదేశ్ ఆ లక్ష్యాన్ని ఛేదించలేక 109పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు కూడా ఆలౌట్ అయ్యింది లేదు. ఒక్క న్యూయార్క్ పిచ్ కాకుండా వెస్టిండీస్‌లోని బార్బోడస్, గయానా పిచ్‌ల పరిస్థితి ఇదే. ఈ టోర్నీలో డల్లాస్ వేదికగా జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో ఆతిథ్య అమెరికా జట్టు కెనడా నిర్దేశించిన 195పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడమే క్రీడాకారులకు దక్కిన పెద్ద ఊరట.

టి20 ఫార్మాట్‌లో మొదటగా బ్యాటింగ్‌కు దిగిన జట్టుకంటే.. ఛేదనకు దిగే జట్టుకు విజయావకాశాలు మెండుగా ఉంటాయని నానుడి. కానీ ఈసారి టోర్నమెంట్ దానికి పూర్తి రివర్స్‌లో తిరుగుతోంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జట్టు విజయావకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు జరగ్గా.. అందులో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జట్టు 10సార్లు, ఛేదనకు దిగిన జట్టు 9సార్లు విజయాలను నమోదు చేసుకున్నాయి. రెండు మ్యాచ్‌లు సూపర్‌ఓవర్‌కు దారితీయగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. న్యూయార్క్‌లో ఇప్పటివరకు 6మ్యాచ్‌లు జరగ్గా.. అందులో మూడు తొలిసారి, మరో మూడు ఛేదనకు దిగిన జట్టు విజయాలను నమోదుచేసుకున్నాయి.

నాసిరకం పిచ్‌లే కారణమా...

టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లు చప్పగా, లో స్కోరింగ్ గేమ్‌లతో సాగడానికి ప్రధాన కారణం నాసిరకం పిచ్‌లే అని టీమిండియా కోచ్ రాహుల్ ద్రావిడ్ అభిప్రాయపడ్డారు. ఈ పిచ్‌లపై పరుగులు రాబట్టడానికి బ్యాటర్లు కష్టపడాల్సి వస్తోందని, దీంతో వారు తీవ్ర గాయాలపాలయ్యే పరిస్థితులున్నాయన్నారు. ఇదే ఫార్మాట్‌లో భారత్‌లో జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో రికార్డు స్కోర్లు నమోదైన సంగతి తెలిసిందే.

టి20 ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక × నేపాల్
వేదిక: ఫ్లోరిడా; ఉ.5.00గంటలకు

ఆస్ట్రేలియా × నమీబియా
వేదిక: ఆంటిగ్వా; ఉ.6.00గంటలకు

ఇండియా × అమెరికా
వేదిక: న్యూయార్క్; రా.8.00గంటలకు

టి20 ప్రపంచకప్-2024లో అత్యల్ప స్కోర్లు..

1. శ్రీలంక 77/10, దక్షిణాఫ్రికా 80/4(న్యూయార్క్)
2. పపువాన్యూగినియా 77/10, ఉగాండా 78/7(గయానా)
3. ఐర్లాండ్ 96/10, ఇండియా 97/2(న్యూయార్క్)
4. నెదర్లాండ్స్ 103/9, దక్షిణాఫ్రికా 106/6(న్యూయార్క్)
5. నేపాల్ 106/10, నెదర్లాండ్స్ 109/4(డల్లాస్)

సాత్విక్-చిరాగ్ జోడీకి 3వ ర్యాంక్

బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

లాసెన్నె: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ డబుల్స్ జోడీ 3వ ర్యాంక్‌కు పడిపోయింది. ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న వీరు తాజా ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను కోల్పోయారు. మంగళవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట మూడో స్థానంలో నిలిచింది. చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్‌లు అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నారు. డెన్మార్క్ డబుల్స్ జోడీ కింగ్ ఆస్ట్రప్, ఆండర్స్ స్కారప్ రస్ముస్సెన్‌కు రెండో స్థానం దక్కింది. థాయ్‌లాండ్ ఓపెన్ విజయంతో చిరాగ్-సాత్విక్ జోడీ నంబర్ వన్ ర్యాంక్‌కు ఎగబాకింది. సింగపూర్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ఇండోనేషియా ఓపెన్ నుంచి వైదొలగడంతో వీళ్ల ర్యాంక్ మూడుకు పడిపోయింది. ప్రణయ్‌కు 10వ ర్యాంక్.. లక్ష్య సేన్‌కు 14వ ర్యాంక్ దక్కింది. కిడాంబి శ్రీకాంత్ ఏకంగా నాలుగు స్థానాలు కోల్పోయి 32తో సరిపెట్టుకున్నాడు. యువకెరటాలు ప్రియాన్షు రజావత్ 34వ, కిరణ గోర్గ్ 35వ ర్యాంక్‌లో నిలిచారు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు తన ర్యాంక్ నిలబెట్టుకుంది. రెండేండ్లుగా ఒక్క టైటిల్ కూడా గెలవని ఆమె పదో స్థానంలో నిలవగా.. తనీశా క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ 19వ ర్యాంక్‌లో నిలిచింది.

వివాదాస్పద గోల్‌తో భారత్ ఓటమి

ఖతార్ చేతిలో 2-1గోల్స్‌తో పరాజయం

దోహా: ఫిఫా ప్రపంచకప్ అర్హత టోర్నీకి చివరి అవకాశాన్ని భారత్ కోల్పోయింది. ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశ తప్పలేదు. 2వ స్థానం కోసం హోరాహోరీగా సాగిన పోరులో భారత ఫుట్‌బాల్ జట్టు వివాదాస్పద గోల్‌తో పరాజయాన్ని చవిచూసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 1-0తో ఆధిక్యతలో నిలిచిన భారత్.. రెండో అర్ధభాగం ముగిసేసరికి 1-2 గోల్స్‌తో ఓటమిపాలైంది. దోహాలోని జాసిమ్ బిన్ మహ్మద్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 75వ నిమిషం వరకు ఆధిక్యతలో నిలిచింది. ఖతార్‌కు చెందిన యూసెఫ్ 75వ ని.లో బంతిని గోల్‌కి నెట్టడం వివాదాస్పదమైంది. ఇక 85వ ని.లో అల్రావీ మరో గోల్ చేయడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఓటమితో ఎఎఫ్‌సి ఆసియాకప్-2027కు భారత్ నేరుగా అర్హత సాధించడంలో విఫలమైంది.

కాలిఫోర్నియా వర్శిటీలో

మళ్లీ భగ్గుమన్న నిరసనలు

• విద్యార్థుల శిబిరంపై పోలీసుల దాడి



యూనివర్శిటీ వద్ద విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

లాస్‌ఏంజెల్స్ : గాజాకు సంఘీభావంగా కాలిఫోర్నియా యూనివర్శిటీలో ఆందోళన మళ్లీ ఊపందుకుంది. .కేంపస్‌లో మూడోసారి శిబిరాన్ని ఏర్పాటు చేసి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నవారిపై పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. విద్యార్థులు ప్రతిఘటించడంతో కేంపస్‌లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. లాస్‌ఏంజెల్స్‌లోని యూనివర్శిటీలోని ఈ యూనివర్సిటీలో ఆందోళనకారులు శిబిరాలు వేసి, బారికేడ్లు ఏర్పాటు చేశారని విద్యార్థుల పత్రిక డైలీ బ్రూయిన్ పేర్కొంది. ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్లకు ప్రతీకగా రక్తమోడుతున్న శరీరపు భాగాల బొమ్మలను పట్టుకుని ఆందోళన కారులు ప్రదర్శన నిర్వహించారు. "మన అమరులను గౌరవిద్దాం" అని వారు నినదించారు. ఇప్పటివరకు 46వేల మందికి పైగా పాలస్తీనియన్లు ఈ మారణహోమంలో మరణించారని ఈ నిరసన ప్రదర్శన నిర్వాహక సంస్థ స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తీనా తెలిపింది. ఈ నిరసనలకు చేతులు కలపాల్సిందిగా ప్రజలను కోరింది..

దక్షిణ గాజాలో ఆహార పంపిణీ నిలిపివేత

• ఇజ్రాయిలే కారణమన్న డబ్ల్యుఎఫ్‌పి



ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరం వద్ద ఆహారం కోసం పళ్లేలతో ఎదురు చూస్తున్న చిన్నారులు.

న్యూయార్క్ : సెంట్రల్ గాజాలో అమెరికా నిర్మించిన ఫ్లోటింగ్ డాక్ ద్వారా ఆహార పంపిణీని నిలిపివేసినట్లు ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) సోమవారం తెలియచేసింది. తమ సిబ్బంది భద్రతపై ఆందోళనలు తలెత్తడంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. డబ్ల్యుఎఫ్‌పి గోదాముల సముదాయంపై కూడా రాకెట్ల దాడి జరిగిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. గాజాలోకి మరింత సాయాన్ని పంపించేందుకు వీలుగా అమెరికా మిలటరీ తాత్కాలికంగా ఈ నిర్మాణాన్ని చేపట్టింది. ఇజ్రాయిల్ దిగ్బంధనంలో వున్న గాజా ఉత్తరప్రాంతం పూర్తిగా కరువు బారిన పడిందని, ఇప్పుడు మళ్లీ ఆటువంటి క్షామ పరిస్థితులు దక్షిణ గాజాలో చోటుచేసుకుంటున్నాయని డబ్ల్యుఎఫ్‌పి తెలిపింది. ఇజ్రాయిల్ కావాలనే ఆహార సరఫరాలను అందనివ్వడం లేదని ఐక్యరాజ్య సమితి విమర్శించింది.. ఈ పరిస్థితుల్లో తాత్కాలికంగానే తాము ఆహార సరఫరాలను నిలిపివేశామని ఆ గ్రూపు తెలిపింది. సిబ్బంది, భాగస్వాముల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొంది. శనివారం జరిగిన దాడిలో సంస్థకు చెందిన రెండు గిడ్డంగులపై రాకెట్ల దాడి జరిగిందని, ఒకరు గాయపడ్డారని ప్రోగ్రామ్ డైరెక్టర్ సిండీ మెక్‌కెయిన్ మీడియాకు తెలిపారు. భద్రతా కారణాల రీత్యానే ఒక్క అడుగు వెనకేయాల్సి వచ్చిందన్నారు. ఏప్రిల్‌లో నిర్మాణం ఆరంభించి మే మధ్యలో పూర్తి చేసుకున్న ఈ ఫ్లోటింగ్ డాక్‌కు తుపాను కారణంగా నష్టం జరగడంతో ఒక వారం పనులు ఆగిపోయాయి. గత శుక్రవారమే మరమ్మత్తులు పూర్తయ్యాయి. శనివారం దాదాపు 500 మెట్రిక్‌టన్నుల ఆహారం దిగుమతి అయింది. అయితే భీకర దాడుల కారణంగా ఆహార పంపిణీ ఆపివేశారు.



పోరాటాలతో

'కల్కి' ట్రైలర్

ప్రభాస్ నటించిన తాజా సినిమా 'కల్కి 2898 ఎడి'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించింది. దీపికా పదుకొనే, దిశా పాటాని, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. అద్భుతమైన విజువల్స్‌తో సాగే ఈ ట్రైలర్‌లో యాక్షన్‌కు దర్శకులు పెద్దపీట వేశారు. ఓ అమ్మాయి కోసం అశ్వద్ధామ (అమితాబ్ బచ్చన్) చేసే పోరాటానికి భైరవ (ప్రభాస్) అడ్డుగా వెళ్తాడు. 'కావాలంటే రికార్డులు చూసుకో.. ఇప్పటివరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఇది కూడా ఓడిపోను' అంటూ ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. కమల్ హాసన్ పాత్రని కూడా ట్రైలర్‌లో పరిచయం చేశారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ కథలు ఇష్టపడేవాళ్లకు, యాక్షన్ ప్రియులకు ఈ సినిమా బాగా నచ్చుతుంది. కాగా ఈ సినిమాను మేకర్స్ ఈనెల 27న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

జీవన సౌరభం

బాణమైనా సరే..వెనక్కు సంధించనిదే దూసుకెళ్లలేదు.మనకు వచ్చిన కష్టాలు కూడా అంతే...



ఉపాయంతో తప్పిన అపాయం

ఓ అడవిలో కుందేలు తన నాలుగు పిల్లలతో ఓ ఇల్లు నిర్మించుకుని నివసించేది. ఓ రోజు ఆ అడవికి బాగా దూరంగా మేతకు వెళ్లింది తల్లి కుందేలు. దాని పిల్లలకు బాగా ఆకలి వేసింది. తల్లి కోసం ఇంటి తలుపులు తెరచి ఎదురు చూడసాగాయి. సాయంత్రమైంది. అయినా, తల్లి ఇంటికి చేరలేదు. పిల్లల మనసులో అలజడి మొదలైంది. చీకట్లో వాటికి నిద్ర పట్టక తల్లి కోసం వేయి కళ్లతో ఎదురు చూడసాగాయి. దూరంలో నక్కల అరుపులు వినిపించాయి. నక్కలు తమను తినివేస్తాయని భయపడ్డాయి. తలుపులు వేసుకున్నాయి. నక్క రానే వచ్చింది.

ఓ కుందేలు పిల్ల బయట ఏమి జరుగుతోందో తలుపుల కన్నం లోంచి గమనించ సాగింది. నక్క నెమ్మదిగా తల్లి కుందేలు గొంతుతో 'పిల్లలూ, తలుపు తీయండి' అని అరవసాగింది. ఓ కుందేలు పిల్ల నమ్మి నిజంగా తన తల్లి వచ్చిందనే భావనతో తలుపు తెరిచింది. ఎన్నో రోజులుగా ఆహారం లేని ఆ నక్క ఒక్కసారిగా వాటిపైకి దూకింది. అవి భయంతో వణికిపోయి నలుదిక్కులా పరుగు పెట్టాయి. వాటి వెనుకే పరిగెత్తింది నక్క. కొయ్యలతో చేసిన ఆ చెక్క ఇంటి అరుగుపైకి ఎక్కి కూర్చుంది వాటిలో పెద్ద కుందేలు పిల్ల. కిందే వున్న చిన్న కుందేలు పీక పట్టుకోబోయింది నక్క. అటకపై వున్న కుందేలుకు వెంటనే మెరుపులాంటి ఆలోచన తట్టింది.

'ఓ నక్క బావా.. నీ చెరువంత పొట్టకి ఈ చీమంత ఆహారం ఏం సరిపోతుంది? రా... ఆ పక్కనే ఓ నీటి గుంట వుంది. అక్కడికి ఓ పెద్ద గొర్రెల గుంపు వస్తుంది. నువ్వు కడుపు నిండా తినొచ్చు' అంది పెద్ద కుందేలు.

నక్కకి నోరూరింది. 'సరే వెళ్దాం పద.. అని తొందరపెట్టింది. అప్పటికే తెల్లారుతోంది. కుందేలు వెనుకే నడిచింది నక్క. నీటి గుంట వద్దకు వెళ్లిన నక్కకు ఎదురుగా వస్తున్న ఒంటరి గొర్రె కనిపించింది. కుందేలు 'అయ్యో ఈ ఒక్క గొర్రెకే అంత ఆశపడటం దేనికి? అటు చూడు.. ఆ పక్క వంద గొర్రెలు ఉన్నాయి. ఇష్టమొచ్చినన్ని తిందువు గాని రా. ఈ నీటి గుంటను దాటుకుని వెళదాం' అంది కుందేలు.

నక్క ఉత్సాహంతో ఉరకలు వేస్తూ నీటి గుంటలోకి దిగింది. కొద్ది సేపటికే అందులో వున్న మొసలి నోటికి చిక్కి గావుకేక పెట్టింది నక్క. అది అరుస్తుంటే తమ ప్రాణాలు దక్కినందుకు ఎగిరి గంతేశాయి కుందేలు పిల్లలు. కొద్దిసేపటి తరువాత వచ్చిన తల్లి కుందేలు జరిగిన సంగతి తెలుసుకొని, తన పిల్ల తెలివితో మిగతా తన సోదరులను కాపాడినందుకు 'శభాష్' అని మెచ్చుకుంది. వాటి సంబరం చూసి అక్కడే వున్న అక్కడే వున్న మనుషులు వాటి వద్దకు వచ్చారు. ఇన్నాళ్లూ తమ గొర్రె పిల్లలకు హాని కలిగిస్తున్న నక్క బెడదను కుందేలు ఉపాయంతో తప్పించినందుకు మెచ్చుకున్నారు.

– బోగా పురుషోత్తం, తుంబూరు.

పిల్లల్లారా, రారండి!



వేసవి సెలవులు
ముగిశాయని కుశాలగా
తనువెల్లా నోరు చేసుకొని
ప్రేమగా బడి పిలుస్తున్నది
పిల్లలూ పరుగున రారండి!
కనురెప్పలు వేయక
మీ రాక కోసం
బడి ఎదురు చూస్తున్నది
ఉత్సాహంతో రారండి
మీ ప్రార్థనాగీతం కోసం
సమావేశమందిరం తపిస్తున్నది
ఉరకలేస్తూ రారండి
మీ అడుగుల సవ్వడికి
ఆటస్థలం ఆత్రుతతో వుంది
ఆనందంగా రారండి
మీ చేతి స్పర్శకు కొత్త పుస్తకాలు
తహతహలాడుతున్నాయి
తొందరగా రారండి
మీ గుండె చప్పుళ్ళకు
గ్రంథాలయం నిశ్శబ్దంగా
నిరీక్షిస్తున్నది
వడివడిగా రారండి
అమ్మనాన్నలా ఆదరించి
పాఠాలు చెప్పడానికి
గురువులు స్వాగతిస్తున్నారు
విద్యార్థుల్లారా, విచ్చేయండి!

– సురేంద్ర రొద్ద
94915 23570

విడిదికి సెలవు .. చిన్నారి మొదలు

నేస్తాలూ, ఈరోజుతో వేసవి విడిది శీర్షికను ముగిస్తున్నాం. రచనలు పంపిన అందరికీ ధన్యవాదాలు. ఇక మీరు కొత్త పుస్తకాలతో, కొత్త తరగతులతో బిజీ అయిపోతారు కదా.. ఇంతకు ముందులాగానే చిన్నారి శీర్షిక యథావిధిగా మిమ్మల్ని పలకరిస్తుంది. తీరుబడి వేళల్లో చదువుతూ, రచనలు పంపుతూ ఉండండి మరి! వచ్చే ఆదివారం 'స్నేహ' అనుబంధం ఎక్కువ పేజీలతో బాలల ప్రత్యేక సంచికగా వస్తోంది. **– ఎడిటర్**

బొమ్మరిల్లు




షేక్ జరా ఫాతిమా,
6వ తరగతి,
హైదరాబాద్ పబ్లిక్ స్కూలు,
కడప






ఆర్.హేమసాయి హాసిని,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి





బి.జ్ఞాన్వి,
యూకేజీ
చిన్న కోడూర్,
సిద్ధిపేట జిల్లా



మళ్లీ బడికి ఉత్సాహంగా ...



వేసవి సెలవుల తర్వాత పిల్లల్ని మళ్లీ స్కూళ్లకు ఎలా అలవాటు చేయాలా? అని హైరానా పడుతున్నారా? వేసవి కాలమంతా పిల్లలు ఇంట్లోనే ఉంటూ అమ్మమ్మలు, నానమ్మలు, స్నేహితులతో హాయిగా గడిపేశారు. ఇప్పుడు వేసవి సెలవులు ముగిసి, మళ్లీ బడికి వెళ్లే సమయం ఆసన్నమైంది. గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇంతకాలం బాగా ఎంజాయ్ చేసిన పిల్లలు, ముఖ్యంగా చిన్న పిల్లలు ఇప్పుడు ఒక్కసారిగా బడికి వెళ్లాలంటే కొంత ఇబ్బంది పడొచ్చు. ఇన్నాళ్లూ ఆలస్యంగా నిద్ర లేవడం, ఇంట్లో ఆడుకోవడం, నచ్చినవి తినడం చేసుంటారు. ఇలా అలవాటు పడిన పిల్లలను, ముఖ్యంగా చిన్న తరగతుల పిల్లలను పాఠశాలకు పంపే ఈ సమయంలోనే పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. వారిని ముందు మానసికంగా సంసిద్ధులను చేయాలి. పాఠశాలకు వెళ్లే విధంగా వారిని ప్రోత్సహించాలి. కొత్త పుస్తకాలు, కొత్త బ్యాగు, కొత్త లంచ్ బాక్సు వంటి సన్నాహాలతో ఉత్సాహపడేలా చేయాలి.

నిపుణుల సూచనలు

పిల్లలు చక్కగా బడికి అలవాటవ్వాలంటే తల్లిదండ్రులు కొన్ని పద్ధతులు పాటించాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లలు బడికి అలవాటు అవ్వాలంటే ముందుగా టైం సెట్ చేయాలి. నిద్ర లేవడం, రెడీ అవ్వడం, ఆడుకోవడం, హోంవర్క్ చేయడం, కుటుంబ సభ్యుల కోసం కాస్త సమయం.. ఇలా వాళ్లు చేసే కార్యకలాపాలన్నింటికీ సమయం కేటాయిస్తూ ఒక నెల రోజుల పాటు టైం టేబుల్ సెట్ చేయాలి. స్కూలు నుంచి రాగానే ఆ రోజు ఏం చెప్పారు? హోం వర్కు చేయాల్సింది ఉందా? అనే విషయాలను అడిగి తెలుసుకోవాలి. చిన్న చిన్న గణిత ప్రక్రియలు చేయించడం, కథలు చదివించడం, దినపత్రికలు చదివించడం చేయాలి. పిల్లలకు కఠినంగా ఉండే అంశాల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతో సహాయ సహకారాలు అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పి ఒత్తిడి లేకుండా చూడాలి.

ఎంపిక చేసుకోనివ్వాలి : మీ పిల్లలకు అవసరమైన పాఠశాల సామగ్రి, పుస్తకాలు, బూట్లు, యూనిఫారాల జాబితాను ముందుగానే రూపొందించుకోవాలి. పిల్లలను షాపింగ్‌కు తీసుకుని వెళ్లి అవసరమైనవి, అనుగుణమైనవి వారినే సెలెక్ట్ చేసుకోనివ్వాలి.

చదువే కాదు మిగిలినవీ ముఖ్యమే : ఖాళీ సమయాల్లో వారేం చేయాలనుకుంటున్నారో ముందుగా వారినే అడగాలి. వారి అభిరుచులు, ఆసక్తులను తెలుసుకోవాలి. వారికి ఏయే అంశాల్లో నైపుణ్యం ఉందో అవగాహన చేసుకోవాలి. ఆటలు, పాటలు, డాన్సులు, చిత్రలేఖనం, ఏమైనా సంగీత వాయిద్యాలు వాయించడాన్ని ఇష్టపడితే ఆయా అంశాల్లో సమయాన్ని బట్టి శిక్షణను ఏర్పాటు చేస్తే వారిలో మానసికోల్లాసం కలుగుతుంది.

పౌష్టికాహారం చాలా ముఖ్యం : అధిక ప్రోటీన్ కలిగిన అల్పాహారం ఇచ్చి పిల్లలను బడికి పంపాలి. అది వారి శారీరక, మానసిక బలాన్ని మరింత బలపరుస్తుంది. వారు ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇచ్చేందుకు ప్రిఫర్ చేయాలి. మంచినీరు ఎక్కువ తాగేలా ప్రోత్సహించాలి. కొత్త విద్యా సంవత్సరానికి పిల్లలను అలవాటు చేయడం కాస్త కష్టమే అయినప్పటికీ.. పైన చెప్పినవన్నీ ఫాలో అయితే త్వరగా అలవాటు పడిపోతారు. అలాగే స్కూళ్లో వారు సాధించిన విజయాలను సెలబ్రేట్ చేస్తే వారిలో ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది.

ఈ జాగ్రత్తలు కూడా కీలకమే!

- ఇన్నాళ్ళు పిల్లలు ఫోన్‌కు అలవాటు పడిపోయి ఉన్నారు. స్కూలు నుంచి రాగానే ఫోన్ కోసం పట్టుబడతారు. అయితే ముందుగా హోంవర్క్, చదవాల్సిన సబ్జెక్ట్‌లను పూర్తి చేయాలని చెప్పాలి.
- ఫోన్‌ను ఎక్కువ సేపు వాడనివ్వకుండా చూడాలి.
- హోంవర్క్ పూర్తయిన తరువాత ఎక్కువ సమయం ఆటలకు కేటాయించేలా ప్రోత్సహించాలి. దగ్గర్లోని పార్కులు లేదా ఆటస్థలాలకు తీసుకెళ్లి ఆడించాలి.
- పిల్లలు రాత్రిళ్లు త్వరగా నిద్రపోయే విధంగా చూడాలి.
- వేకువ జామునే నిద్ర లేచి, తొందరగా కాలకృత్యాలు పూర్తి చేసేలా చూడాలి.

– పాలడుగుల శివ నాగ రాజారావు,
తెలుగు ఉపాధ్యాయులు,
జెడ్పీ ఉన్నత పాఠశాల,
మీర్జాపురం,
ఏలూరు జిల్లా.



చింత చిగురుతో ఆరోగ్య ప్రయోజనాలు



ఈ సీజన్‌లో విరివిగా లభ్యమయ్యే చింత చిగురుతో ఎన్నో లాభాలున్నాయి. రుచికరమైన ఆహారంగానే కాక దీన్ని తినడం వల్ల ఆరోగ్యం కూడా చేకూరుతుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా బాగానే పనిచేస్తుంది. ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచిది పెంచుతుంది. చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను తగ్గిస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. దీనితో చేసిన వంటలను చిన్నారులకు తినిపిస్తే కడుపులో నులి పురుగుల సమస్య తగ్గుతుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇందువల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలున్నాయి. ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్ సమస్యలు తగ్గుతాయి. రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలున్నాయి.

ఇఎపిసెట్ ఫలితాలు విడుదల

- టాప్ టెన్‌లో అబ్బాయిలే అధికం
- ఇంజినీరింగ్, ఫార్మసీలో అత్యధికంగా బాలికలు...
- వ్యవసాయంలో బాలురు ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్‌లో బాలికలు, వ్యవసాయంలో బాలురు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యారు. అయితే, ఈ రెండు విభాగాల్లోని టాప్‌టెన్‌లో మాత్రం బాలురే పై చేయి సాధించారు. ఈ మేరకు రూపొందించిన ఫలితాలను ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. రామమోహన్‌రావు, జెఎన్‌టియు కాకినాడ విసి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాదరాజు మంగళవారం విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో విడుదల ఇంజనీరింగ్, ఫార్మాసి విభాగంలో 2,74,213 మంది దరఖాస్తు చేసుకోగా 2,58,374 మంది పరీక్ష రాశారు. వీరిలో 1,95,092(75.51శాతం)మంది అర్హత సాధించారు. బాలురు 73.93శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు వారి కంటే 3.72శాతం అదనంగా 77.65శాతం ఉత్తీర్ణులయ్యారు. అగ్రికల్చర్ విభాగంలో 88,638 మంది దరఖాస్తు చేసుకోగా 80,764 మంది పరీక్ష రాశారు. వీరిలో 70,352(87.11శాతం) మంది అర్హత సాధించారు. బాలురు 87.98శాతం, బాలికలు 86.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మొదటి పది స్థానాలు బాలురే సాధించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమా మహేశ్వరి, కార్యదర్శి నజీర్ అహ్మద్, సెట్ల కన్వీనర్ ఎం సుధీర్ రెడ్డి, అసిస్టెంట్ సెట్ల కన్వీనర్ మాధవి, ఇఎపిసెట్ కన్వీనర్ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న అధికారులు

టాప్ టెన్ ర్యాంకర్ల వివరాలు

ఇంజనీరింగ్			అగ్రికల్చర్		
ర్యాంకు	విద్యార్థి పేరు	మార్కులు	ర్యాంకు	విద్యార్థి పేరు	మార్కులు
1.	మాకినేని జిష్ణుసాయి	97.0022	1.	యేళ్ల శిరీష రెడ్డి	93.4463
2.	మురసాని సాయియశ్వంత్ రెడ్డి	96.8358	2.	పూల ద్వివతేజ	92.9278
3.	భోగాలపల్లి సందేష్	96.4285	3.	వడ్లపూడి ముఖేష్ చౌదరి	92.7966
4.	పాలగిరి సతీష్ రెడ్డి	96.0330	4.	పేరా సాత్విక్	92.6212
5.	కోమటినేని మనీష్ చౌదరి	95.3305	5.	ఆలూరు ప్రణీత	91.8895
6.	ఇప్ప లక్ష్మీనరసింహారెడ్డి	95.2584	6.	గట్టు భానుతేజసాయి	91.4172
7.	గోళ్ల లేఖ హర్ష	95.1121	7.	పెన్నమడ నీహారిక రెడ్డి	90.9382
8.	పుట్టి కుశల్ కుమార్	94.3563	8.	శంబంగి మనోఅభిరామ్	90.6581
9	పరమరధ్యుల సుశాంత్	94.2113	9	శరగదం పావని	90.4518
10.	కోమిరిశెట్టి ప్రభాస్	93.9100	10.	నగుదసారి రాధాకృష్ణ	90.3378

ప్రణాళిక శాఖలో కదలిక

- గణాంకాల తయారీపై దృష్టి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చంద్రబాబు అంటేనే ... రకరకాల సర్వేలు, విశ్లేషణలు... పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు ! గంటల కొద్దీ ఆయన నిర్వహించే సమీక్షలకు ఆ గణాంకాలే కీలకం! క్షేత్రస్థాయి సమాచారంతో ఎప్పటికప్పుడు వాటిని ఆయనకు ప్రణాళిక శాఖ అందించేది! అటువంటి కీలకమైన శాఖకు గత ప్రభుత్వ హయంలో పని పెద్దగా లేకుండా పోయిది. తప్పనిసరి తంతులా చేసే ఒకటి, రెండు పనులకు తప్ప తమను ఉపయోగించుకోవడం లేదని ఆ శాఖ అధికారులే వాపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం పార్టీ గెలిచి, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించనుం డటంతో ఆ శాఖలో కదలిక ప్రారంభమైంది. కొంతకాలంగా పక్కన పడేసిన ఫైళ్ల బూజు దులిపే పనిలో అధికారులు నిమగ్నమైనారు. చంద్రబాబు ఏ సమీక్ష పెడతారో, ఏ గణాంకాలు అడుగుతారో అన్న ఆందోళన ఆ శాఖ సిబ్బందిలో కనపడుతోంది. దీంతో ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు, ఆ పార్టీ ప్రాధాన్యతలు అధ్యయనం చేసి దానికనుగుణంగా అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో అధికారులు నిమగ్నమైనారు. అయితే ఈ శాఖ అప్పట్లో తయారు చేసిన కొన్ని నివేదికలే చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశాయన్న అభిప్రాయం కూడా ఉంది. చంద్రబాబు మెప్పు పొందేందుకుగాను లేని వృద్ధిని చూపించారన్న విమర్శలున్నాయి.

ఒడిషా సిఎంగా మోహన్ చరణ్ మాంఝీ

- నేడు ప్రమాణస్వీకారం



భువనేశ్వర్ : ఫలితాలు వెల్లడైన వారం రోజుల తరువాత ఒడిషా సిఎంగా మోహన్ చరణ్ మాంఝీని నియమించాలని బిజెపి నిర్ణయించింది. భువనేశ్వర్‌లోని బిజెపి కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించారు. గత అసెంబ్లీలో బిజెపి చీఫ్ విప్‌గా ఉన్న మాంఝీ ఇప్పటివరకూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉప ముఖ్యమంత్రులుగా పాట్నాగఢ్ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కెవి సింగ్ డియో, నిమపర నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన ప్రావిత పరిడాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, భూపేంద్ర యాదవ్ కేంద్ర పరిశీలకులుగా పాల్గొన్నారు. మాంఝీ బుధవారం సిఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. జనతా మైదానంలో సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ పాల్గొననున్నారు.

విమాన ప్రమాదం..

మలావి ఉపాధ్యక్షుడు సహా 10 మంది మృతి





లిలాంగ్వే : ఆగ్నేయాఫ్రికా దేశమైన మలావి ఉపాధ్యక్షుడు సాలోస్ క్లాజ్ చిలిమా ప్రయాణిస్తున్న విమానం కూలిపోయిందని, ఈ ప్రమాదంలో ఆయనతోపాటు మరో తొమ్మిది మంది కూడా మరణించారు. విమానంలోనివారెవరూ జీవించిలేరని అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా తెలిపారు. విమానం అడవిలో కూలిపోయిందని తెలిపారు. ఆ సమయంలోఉపాధ్యక్షుడు, మాజీ అధ్యక్షుని భార్య, ఏడుగురు ప్రయాణికులు, ముగ్గురు మిలటరీ సిబ్బంది అందులో ఉన్నారు. సోమవారం రాజధాని నగరం నుండి సోమవారం ఉదయం 9.17 గంటలకు బయలుదేరిన విమానం 45నిముషాల తర్వాత ముసుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి వుంది. కానీ విమానం బయల్దేరిన కొద్దిసేపటికే రాడార్‌లో విమానం మాయమైంది. మూడు రోజుల క్రితం మరణించిన కేబినెట్ మంత్రి రాల్ఫ్ కసంబా అంత్యక్రియంల్లో పాల్గొనేందుకు చిలీమా, మలావి మాజీ అధ్యక్షుని భార్య, యునైటెడ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పార్టీకి చెందిన ప్రతినిదులు విమానంలో బయల్దేరి వెళ్తుండగా ఈ ఘోరం జరిగిపోయింది. విమాన ప్రమాద వార్త తెలియగానే అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా తన విదేశీ పర్యటనను రద్దు చేసుకుని, సహాయక చర్యలపై దృష్టి కేంద్రీకరించారు. చిలీమా 2014 నుండి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తారని భావించారు.

2022లో ఆయనపై ముడుపుల ఆరోపణలు రావడంతో అరెస్టు చేశారు. అయితే గత నెల్లోనే ఆయనపై అభియోగాలను కోర్టు ఉపసంహరించింది. ఈ కేసును కొనసాగించాలనుకోవడం లేదని పబ్లిక్ ప్రాసిక్యూషన్ డైరెక్టర్ నోటీసులు పంపడంతో కోర్టు కేసును మూసేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68